## నేటి కందం-నేటికి అందం

ఈసు నసూయ నెరుంగక
మోసులు వారంగ రోగి ముద మొందంగన్
ఈ సంజీవని సేవలు
భాసురముగ భారతాంబ ప్రగతిని జూపున్ !!

(దేశం మొత్తానికీ ప్రభుత్వం అందిస్తున్న డిజిటల్ టెలీ మెడిసిన్ సేవ అయిన"ఈ -సంజీవని" పథకం కింద రోగులకు రవాణా ఖర్చు లేని వైద్యం దొరుకుతున్నది. దీని వలన కోట్లాది బీదల ఆరోగ్యం మెరుగుపడుతున్నది
మీ ఆరోగ్యం మీ చేతుల్లో..)



-రాధశ్రీ
సెల్:9494481210


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com


## చురక

జులై వరకు కరువే
జీవితం ఇక బరువే
కష్టజీవుల కంటనీరు
కారి నిండే చెరువే.
ఎగిసిపడే ప్రకోపం
ఎల్ నినో ప్రభావం
ప్రకృతిని మనమంతా
పాడుచేసే స్వభావం



-వేల్పుల నారాయణ
9440433475


హైదరాబాద్ ఆదివారం 25-10-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:73 పేజీలు:6 వెల: రూ.1/-


# శంషాబాద్ ఎయిర్‌పోర్టులో భారీగా ఫారిన్ కరెన్సీ పట్టివేత

హైదరాబాద్, అక్టోబర్ 24: హైదరాబాద్ నగర శివారులోని శంషాబాద్ ఎయిర్‌పోర్టు (ౠష్ట్రజీఎబష్ట్రజీఎజీట ంతితీజూనీతీబి) లో తనిఖీలను ఎంత కట్టుదిట్టం చేసినా బంగారం స్మగ్లింగ్ (ఉనీశ్రీట బఎబీణణశ్రీతినిణ), విదేశీ కరెన్సీ అక్రమరవాణా యథేచ్ఛగా జరుగుతూనే ఉంది. నిత్యం ఎయిర్‌పోర్టు సెక్యూరిటీ అధికారులకు స్మగ్లర్‌లు (ౠఎబీణణశ్రీవతీబ) పట్టుబడుతూనే ఉన్నారు. తాజాగా ఇద్దరు ప్రయాణికుల నుంచి భారీగా ఫారిన్ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు.

వివరాల్లోకి వెళ్తే.. శనివారం ఉదయం ఇద్దరు ప్రయాణికులు కౌలాలంపూర్ వెళ్లేందుకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చారు.

అయితే వారి నడవడిక తేడాగా అనిపించడంతో అనుమానించిన డీఆర్ఐ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో వారి దగ్గర భారీగా విదేశీ కరెన్సీ లభ్యమైంది. పట్టుబడ్డ నగదు విలువ దాదాపుగా రూ.1.56 కోట్లు ఉంటుందని డీఆర్ఐ అధికారులు తెలిపారు. ఇద్దరు నిందితులు ఎయిర్‌ఏషియా ఏకే-68 విమానంలో వెళ్లేందుకు వచ్చి పట్టుబడ్డారు. పోలీసులు ఇద్దరినీ అరెస్టు చేశారు.






# రాజ్యాంగ సంస్థలను కేంద్రం నిర్వీర్యం చేస్తోంది

### ఎన్నికల సంఘాన్ని జేబు సంస్థగా వాడుకుంటున్నారు
### దేశంలో ఎక్కడా లేని విధంగా అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకొచ్చాం
### అడ్వకేట్ల సమస్యలపై నవంబర్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తాం: టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్



హైదరాబాద్, అక్టోబర్ 24:రాజ్యాంగబద్ధ సంస్థలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. ఎన్నికల సంఘాన్ని జేబు సంస్థగా ఉపయోగించుకుంటున్నారని, సీబీఐ, ఈడీలను ఇష్టానుసారంగా వాడుకుంటున్నారని ఆరోపించారు. గాంధీభవన్‌లో నిర్వహించిన టీపీసీసీ లీగల్ సెల్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు.

అడ్వకేట్ వృత్తి గౌరవప్రదమైనదని, అదే సమయంలో ఎంతో కష్టంతో కూడుకున్నదని మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. తాను కూడా అడ్వకేట్ కావాలనుకున్నానని, అయితే ఆ అవకాశం దక్కలేదని తెలిపారు. న్యాయవాద వృత్తి నుంచి వచ్చిన పలువురు రాజకీయాల్లో రాణించారని చెప్పారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి

దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను తీసుకొచ్చామని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. న్యాయవాదుల సమస్యలు, స్టైఫండ్ పెంపు తదితర అంశాలపై నవంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చిస్తామని వెల్లడించారు.

80 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చాం

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే 80 వేలకు పైగా ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు సామా రామ్మోహన్‌రెడ్డి, సర్వోత్తమ్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు.

# పారా అథ్లెట్ల విజయాలు యువతకు స్ఫూర్తి

### భారత్‌కు 114 పతకాలు.. రాష్ట్రపతి ముర్ము హర్షం



న్యూ ఢిల్లీ, అక్టోబర్ 24: ఆసియా పారా గేమ్స్?2026లో భారత పారా అథ్లెట్లు అపూర్వ విజయాన్ని సాధించడంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హర్షం వ్యక్తం చేశారు. ఈ క్రీడల్లో భారత్ అత్యధికంగా 114 పతకాలు సాధించడం దేశానికి ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. పారా అథ్లెట్ల కఠోర శ్రమ, పట్టుదల, ఆత్మవిశ్వాసమే ఈ అసాధారణ విజయానికి కారణమని రాష్ట్రపతి ప్రశంసించారు. వారి విజయాలు యువతకు స్ఫూర్తినిస్తాయని తెలిపారు. ఎన్ని పరిమితులు ఎదురైనా వెనుకడుగు వేయకుండా పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, అంకితభావంతో కృషి చేస్తూ సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని యువతకు ఈ విజయాలు సందేశమిస్తున్నాయని పేర్కొన్నారు. భారత బృందంలోని అథ్లెట్లందరికీ మరోసారి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నట్లు రాష్ట్రపతి ముర్ము వెల్లడించారు.

# నా చిన్నతనంలో అన్యాయాలను చూడలేకే నక్సలైట్ అయ్యా: మంత్రి సీతక్క

హైదరాబాద్, అక్టోబర్ 24: మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలని తెలంగాణ మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. స్త్రీల రాజకీయ ఎదుగుదలలో ఎన్నో సమస్యలు ఎదురవుతాయని పేర్కొన్నారు. ఆయా సమస్యలకు భయపడకుండా వాటిని అధిగమించి వనితలు ఉన్నత స్థానాల్లోకి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈరోజు (శనివారం) హైదరాబాద్ మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో.. పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు.. మహిళా రాజకీయ నాయకత్వం సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సెక్రటరీ గురుదీప్ సింగ్ సత్పాల్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కోటా నీలిమ, పెద్దఎత్తున మహిళ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడారు.

'నా చిన్నతనంలో నేను ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నాను. ఆకలి బాధలు చూశాను.. అయినప్పటికీ అన్ని కష్టాలను ఎదుర్కొని.. నేడు ఈ స్థాయికి చేరుకున్నాను. ములుగు ప్రజల ఆశీర్వాదం, కాంగ్రెస్ పెద్దల అండదండలతో పంచాయతీరాజ్ శాఖకు మంత్రి కాగలిగాను. నాకు ఎలాంటి రాజకీయ బ్యాక్ గ్రౌండ్ లేదు. అపర వనరులు ఉన్న ప్రాంతం ములుగు. అలాంటి ప్రాంతంలో ఒక పేద కుటుంబంలో నేను జన్మించాను. చిన్నతనంలో అన్యాయాలను చూడలేకే నక్సలైట్ అయ్యాను. నేనెప్పుడూ నక్సలైట్ అవుతానని అనుకోలేదు.. కానీ నక్సలైట్ అయ్యాను. ఆ తర్వాత లాయర్, ఎమ్మెల్యే, మంత్రి అవుతానని ఎన్నడూ ఊహించలేదని.. కానీ కష్టాన్ని నమ్ముకొని పనిచేశాను. నేడు మంత్రిగా మీ ముందు ఉన్నాను' అని మంత్రి సీతక్క తెలిపారు.

ప్రజలతోనే ఉండాలనేది నా సిద్ధాంతం...

'నేను మంత్రిగా ఉన్నప్పటికీ ఎప్పుడు నా మూలాలు మరిచిపోలేదు. ప్రజాజీవితమంటే జనంతోనే ఉండాలి. ఇప్పటికీ ప్రతివారం రెండు రోజులు.. నేను ములుగు ప్రజల మధ్యనే ఉంటాను. జనం ఎన్నుకున్నారని.. వారితోనే ఉండాలనేది నా సిద్ధాంతం. ఎమ్మెల్యే, మంత్రి కాగానే ప్రజలతో దూరంగా ఉండాలని.. అప్పుడే గౌరవం ఉంటుందని కొందరు భావిస్తారని.. కానీ నేను ఆ భావనకు పూర్తి విరుద్ధం. మేము ప్రజలకు జవాబు దారులమని.. బాసులం కాదని.. మనం సేవకులం. నాయకులకు ప్రజలే బలం. అయితే మహిళలు ఉన్నతస్థాయికి ఎదిగినా వివక్షతను ఎదుర్కొంటున్నారు. పురుష మంత్రులకు ఇచ్చినంత గౌరవం.. మహిళా మంత్రులకు ఇవ్వరు. అయినప్పటికీ మనం వెనకడుగు వేయాల్సిన అవసరం లేదు. డెడికేషన్, డిటర్మినేషన్‌తో పనిచేస్తూ పోవాలి. నా జీవితం కష్టాల కలపోత, పోరాటాలమయం. నా కష్టాలను. పోరాటాలను ఎప్పటికీ మర్చిపోను' అని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# కమీషన్ల కోసం కక్కుర్తిపడి కాళేశ్వరం కట్టారు: మంత్రి ఉత్తమ్ కుమార్



హైదరాబాద్, అక్టోబర్ 24: కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై బీఆర్ఎస్ పార్టీ పదేపదే అబద్ధాలు చెబుతోందని నీటి పారుదల శాఖామంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణలో నీటిపారుదల వ్యవస్థను గత ప్రభుత్వం నాశనం చేసిందని మంత్రి దుయ్యబట్టారు.

'బీఆర్ఎస్ కమీషన్లకు కక్కుర్తి పడి కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణానికి పూనుకుంది. ఉద్దేశపూర్వకంగానే ప్రాణహిత చేవెళ్ల నుంచి మేడిగడ్డకు మార్చారు. ప్రాజెక్ట్ వ్యయాన్ని 37వేల కోట్ల నుంచి లక్షన్నర కోట్లకు పెంచారు. వాళ్ళు కట్టిన ప్రాజెక్ట్ వాళ్ల హయాంలోనే కూలిపోయినా.. ఇంకా సిగ్గులేకుండా మాట్లాడుతున్నారు. సీతారామ ప్రాజెక్ట్ రీ డిజైన్ పేరిట 2వేల కోట్ల ప్రాజెక్ట్ వ్యయాన్ని 20 వేల కోట్లకు పెంచారు. అధిక వ్యయంతో నిర్మించినా సరే.. కనీసం ఒక్క ఎకరాకైనా నీళ్లు ఇచ్చారా? జూరాల, దేవాదుల, పాలమూరు రంగారెడ్డి, ఎస్ఎల్బీసీ పూర్తి చేసి ఉంటే ఈ రోజు ఎల్‌నినో ప్రభావం తెలంగాణపై ఉండేది కాదు. రాష్ట్రంలో నీటి పారుదల వ్యవస్థను కేసీఆర్ అండ్ కంపెనీ సర్వ నాశనం చేసింది. అబద్ధాలు చెబుతూ.. ప్రజలను మోసం చేస్తున్న కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు పేర్ల ముందు జోసెఫ్ గోబెల్స్ అని పెట్టుకుంటే బాగుంటుంది' అంటూ మంత్రి ఉత్తమ్ తీవ్రంగా విమర్శించారు.

### ముఖ్యమంత్రి అసమర్థత వల్లే రాష్ట్రంలో కరవు: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

ముఖ్యమంత్రి అసమర్థత వల్లే రాష్ట్ర ప్రజలు తాగు, సాగునీరు కోసం ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, కేపీ వివేకానంద మండిపడ్డారు. 'హైదరాబాద్ నగరంలో తీవ్ర నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. నీరు లేక సతమతమవుతూ ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం రాకముందు హైదరాబాద్‌లో ఇలాంటి పరిస్థితి ఉండేది. ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నాక కేసీఆర్ హయాంలో ట్యాంకర్ల అవసరం లేకుండా నీరు అందించారు. ప్రాజెక్టులు నిర్మించి సాగు, తాగు నీరు అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కుతుంది. కేసీఆర్ హయాంలో లేని నీటి కొరత, కాంగ్రెస్ హయాంలో ఎలా ఏర్పడుతోంది. ముఖ్యమంత్రి అసమర్థత, నీటి పారుదల వ్యవస్థలపై అవగాహణా రాహిత్యం వల్లనే నేడు రాష్ట్రంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు' అని ఎమ్మెల్యేలు విమర్శించారు.

# స్కూల్‌లో కాలిన గాయాలతో మరణించిన 12వ తరగతి బాలిక.. అగ్నిప్రమాదంపై అనుమానాలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 24: ఢిల్లీలోని స్కూల్‌లో ఒక బాలిక కాలిపోయిన స్థితిలో మృతిచెందడం కలకలం రేపింది. బాలిక ఎలా కాలిపోయిందనే విషయంలో, అలాగే అగ్నిప్రమాదం ఎలా జరిగిందనే అంశంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బాధిత బాలిక 12వ తరగతి చదువుతోంది. ఈ ఘటన ఢిల్లీలోని కృష్ణా నగర్‌లో శనివారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్కూల్‌లో బాలిక మృతిచెందడంపై కృష్ణా నగర్ పోలీస్ స్టేషన్‌కు మధ్యాహ్నం సమాచారం అందింది.

వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకున్నారు. స్కూల్‌లోని గార్డ్ రూం పక్కన, వాటర్ ట్యాంక్ సమీపంలో 18 ఏళ్ల వయసున్న, 12వ తరగతి చదువుతున్న బాలిక శరీరం కాలిపోయి ఉంది. అప్పటికే బాలిక మరణించినట్లు తెలుస్తోంది. ఘటనా స్థలంలో బాలిక బ్యాగ్, కొన్ని వస్తువుల్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అసలు బాలిక ఎలా మరణించింది.. అగ్ని ప్రమాదం ఎలా జరిగింది అనే విషయాలపై ఇంకా ఎలాంటి స్పష్టతా లేదు. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో ఎవరున్నారు.. స్కూల్ సిబ్బంది ఏం చేస్తున్నారు వంటి సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశంపై బాలిక సోదరి స్పందించింది. తానే ఉదయం తన చెల్లిని స్కూల్‌లో వదిలేశానని, ఉదయం నవ్వుతూనే స్కూల్‌కు వెళ్లిందని తెలిపింది. ఇంతలోపే ఏం జరిగిందో తెలియడం లేదని సోదరి విలపించింది. తన సోదరి ఎలా మరణించింది అనే విషయంపై స్పష్టత రావాలని కోరింది. బాలిక మృతిపై స్థానిక ఎమ్మెల్యే స్పందించారు. ఈ ఘటన తనను కలచివేసిందని, దీనిపై పోలీసులు, అధికారులు విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

# బీదర్‌లో రోడ్డు ప్రమాదం.. ఇద్దరు సంగారెడ్డి వాసులు దుర్మరణం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 24:: పొరుగు రాష్ట్రం కర్ణాటక లోని బీదర్ జిల్లా లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వెళ్తున్న కారు బస్సును ఢీకొట్టడంతో కారులోని ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

మరో నలుగురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. బీదర్ జిల్లా బసవ కల్యాణి వద్ద ఇవాళ ఉదయం ఈ ప్రమాదం జరిగింది.

ప్రమాద సమాచారం అందిన వెంటనే పోలీసులు, స్థానిక అధికారులు ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు.

గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. మృతులు ఇద్దరు తెలంగాణ రాష్ట్రంలోని సంగారెడ్డి జిల్లా మానూరుకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. గాయపడిన వారు కూడా సంగారెడ్డి జిల్లాకే చెందిన వారని సమాచారం.

# కళాకారుల సృజనకు వందనాలు

## (25 అక్టోబర్ "అంతర్జాతీయ కళాకారుల దినోత్సవం" సందర్భంగా)

కళాకారుడు అంటే జీవితాన్ని కళకు అర్పించిన మహామనీషి. పుట్టుకతోనే కొందరు సృజనశీల కళాకారులుగా ప్రకటితం అవుతారు. సృజన ప్రదర్శన ఓ అద్భుత కళ. మన నిత్య జీవితంలో ఎందరో కళాకారులు మన చరిత్రను, సంప్రదాయ కళలను సుసంపన్నం చేస్తూ చూపరులకు వీక్షణ, వీనుల విందులను వడ్డిస్తున్నారు. పెయింటర్స్, సంగీతకారులు, నాట్యకారులు, శిల్పులు, ఫోటోగ్రాఫర్లు, గాయకులు, రచయితలు, నటులు, డిజిటల్ కళాకారులు లాంటి ప్రత్యేక వర్గానికి చెందిన కళాకారులు తమ జీవితాలను కళలకు అంకితం చేసి ప్రపంచ మానవాళి మహోన్నత మన్ననలు పొందుతున్నారు. ప్రపంచానికి అందాలను అద్దే విలక్షణ నైపుణ్య ఆస్తులు మన కళాకారులు. గతాన్ని వర్తమానానికి అనుసంధానం చేసే వీరులు. వాస్తవాలను తవ్వి తీసే నేర్పరులు. సంస్కృతి వారసత్వాలను రేపటి తరానికి అప్పగించే నిస్వార్థ సేవకులు. గత చరిత్రను మన కళ్ల ముందుంచే ధీరులు. వివిధ వర్గాల ప్రజలను ఏకం చేసే శక్తివంతులు. అనేక అవలక్షణాల కలికాలంలో కళాకారులు మాత్రమే మనకు మనశ్శాంతిని ప్రసాదించే మహానుభావులుగా కళాకారులు వెలకట్టలేని సేవలను అందిస్తున్నారు, తమ తర్వాత తరాన్ని కూడా తయారు చేస్తున్నారు.

### అంతర్జాతీయ కళాకారుల దినోత్సవం:

కళకు భాషా భేదాలు లేవు. సరిహద్దులు వాటిని వేరు చేయలేవు. పవిత్ర కళకు జీవితాలను అర్పించి, కఠోర శ్రమ చేస్తూ, కళలో మెలకువలకు రంగులు అద్దుతూ, చూపరుల మదిలో అత్యుత్తమ స్థానాలను ఆక్రమిస్తున్న ప్రపంచ స్థాయి కళాకారులు ఎందరో. అలాంటి అత్యుత్తమ కళాకారుల జాబితాలో ప్రముఖులు ప్రపంచ ప్రఖ్యాత పబ్లో పికాసో. ఆయన ఒక పెయింటర్, ఒక శిల్పి, ఒక సిరామిసిస్ట్, ఓ కవి, ఒక నాటక రచయితగా బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించి ప్రపంచ మన్ననలు పొందడం మనకు తెలుసు. అలాంటి ప్రపంచ ప్రఖ్యాత బహుముఖ కళాకారుడి జన్మదినం 25 అక్టోబర్ 1881ని పురస్కరించుకొని ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏట 25 అక్టోబర్ రోజు "అంతర్జాతీయ కళాకారుల దినోత్సవం (ఇంటర్నేషనల్ ఆర్టిస్ట్ డే)" పాటించడం 2004 నుంచి ఆనవాయితీగా మారింది. అంతర్జాతీయ కళాకారుల దినోత్సవం సందర్భంగా మన చుట్టు ఉన్న కళాకారులను గౌరవించడం, ప్రదర్శనలు ఏర్పాటు చేయడం, పేద కళాకారులకు చేయూత ఇవ్వడం, విద్యాలయాల్లో కళల గూర్చి పోటీలు నిర్వహించడం, ఒక మంచి పెయింటింగ్‌ను కొని ఇంట్లో అమర్చడం, కళలకు సంబంధించిన తరగతులను నిర్వహించడం, ఆర్ట్ గ్యాలరీని సందర్శించడం, పిల్లలకు కాళ్ల పట్ల ఆసక్తిని జాగృతం చేయడం, సంగీత వాయిద్యాల గూర్చి తెలుసుకోవడం లాంటి అనేక కార్యక్రమాలను చేయవచ్చు.

### ఎందరో కళాకారులు - అందరికీ వందనాలు:

ప్రతి ఒక్కరిలో నిగూఢంగా ఓ కళ దాగి ఉంటుంది. దానిని గుర్తించి, నిద్ర లేపి, సాధన చేయడం ప్రారంభం చేయాలి. కళా ప్రదర్శన ఓ పవిత్ర కార్యంగా భావించబడుతున్నది. రేపటి తరానికి నేటి కళలను బదిలీ చేయవలసిన కనీస కర్తవ్యం మన మీద ఉన్నది. మన పిల్లల ఆసక్తిని గమనించి ఏదో ఒక కళను నేర్పించే ప్రయత్నాలను నేడే మొదలు పెడదాం. కళాకారులు ఒక అద్భుత సృజనశీలురు అని, వినూత్న ప్రయోగాల ఆద్యులని పూజ్య భావంతో గౌరవిద్దాం. భారత దేశానికి చెందిన రవి వర్మ, ఎం ఎఫ్ హుసేన్, రవీంద్రనాథ్ ఠాగూర్, నళిని, ఎస్ హెచ్ రాజా, ఎం ఎస్ సుబ్బలక్ష్మి, లతామంగేష్కర్ లాంటి ఎందరో ప్రఖ్యాత కళాకారులు మన వారసత్వ సంపదను సుసంపన్నం చేసారు, వారి శిష్యులు అవే కళలకు డిజిటల్ వెలుగులు అద్దుతున్నారు.

మన ప్రాంతానికి చెందిన కళాకారులకు చేయూత గొడుగులు పడదాం, వారి కళలకు పోషకులుగా వ్యవహరిద్దాం. ఎందరో కళాకారులు, అందరికీ సవినయ వందనాలు.



-మధుపాళీ
9949700037

# చిన్మయ అమృత్ మహోత్సవ్ గ్లోబల్ మిషన్‌ను ప్రారంభించిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 24: చిన్మయ అమృత్ మహోత్సవ్ గ్లోబల్ మిషన్‌ను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ఈ కార్యక్రమంలో తాను పాల్గొనడాన్ని మునులు తనకు అందించిన వాత్సల్యం, ఆశీర్వాదాల తాలూకు ప్రగాఢ ఆధ్యాత్మిక అనుభూతిగా వర్ణించారు. చిన్మయ మిషన్ కేవలం ఒక సంస్థ కాదనీ, అది ఒక ముని స్థాపించిన శాశ్వత చేతన అనీ, అంతేకాకుండా దశాబ్దాల తరబడి తీసుకున్న పవిత్ర సంకల్పాలకు మూలమనీ ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ఉత్సవానికి పెట్టిన పేరు సరిగ్గా సరిపోలుతోందని శ్రీ మోదీ అన్నారు.

పూజ్య గురుదేవులు స్వామి చిన్మయానందతో ఒక హోలోబాట్ ద్వారా మాటామంతీని నిర్వహించడం ఈ కార్యక్రమ భావోద్వేగాన్ని ఇనుమడింపచేసిందనీ, దీనిలో ఆధునిక సాంకేతికత పాత్ర వ్యక్తమవుతోందనీ ప్రధానమంత్రి అన్నారు. ముప్పయ్ మూడు సంవత్సరాల కిందట, అంటే 1993లో వడోదరాలో స్వామీజీతో తాను సమావేశమైన ఘట్టాన్ని ప్రధానమంత్రి కార్యక్రమ ఆహ్వానితులతో పంచుకున్నారు. గురుదేవుల ఆప్యాయతనీ, సంభాషణనీ, ఆయన ఆశీస్సుల్నీ గమనిస్తుంటే నేను మళ్లీ ఆయన సమక్షంలో నిలిచానా ఏమిటని నాకు అనిపిస్తోందని ప్రధానమంత్రి అన్నారు. హృదయాన్ని స్పృశించే విధంగా నివాళి కార్యక్రమానుభూతిని మిగిల్చినందుకు మిషన్ సభ్యులకు ప్రధాని మనసారా కృతజ్ఞతలను తెలియజేశారు. "నా వరకూ చూస్తే, ఇవి అత్యంత భావావేశపూరిత ఘడియలు" అని ప్రధానమంత్రి శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

శికాగోలో సర్వ మత సమ్మేళనాన్ని నిర్వహించి వంద సంవత్సరాలు అయిన సందర్భంగా స్వామి చిన్మయానందను శికాగోకు ఆహ్వానించడానికని 1993 ఫిబ్రవరి–మార్చి మధ్య తాను వెళ్లిన సంగతిని ప్రధానమంత్రి గుర్తుచేసుకున్నారు. అది స్వామి వివేకనంద చరిత్రాత్మక ప్రసంగానికి వంద సంవత్సరాలైన సందర్భం కూడా. అయితే గురుదేవులు అవిశ్రాంతంగా అమెరికా అంతటా పర్యటించి అశేష జనులు ఆ కార్యక్రమంలో పాలుపంచుకొనేటట్లు చూశారనీ, అదే ఏడాది ఆగస్టు 3న శాన్ డియగోలో గురుదేవులు కాలం చేశారనీ ప్రధాని ప్రస్తావించారు. సెప్టెంబర్ 11నాటి సమావేశంలో శికాగోలో ఏర్పాటు చేసిన సమావేశంలో గురుదేవులు లేని లోటు ఎంతగా బాధించిందీ ప్రధానమంత్రి స్మరణకు తెచ్చుకుంటూ, తమ తుది సంభాషణ అంతా యువ శక్తిని సమీకరించడంపైనే ప్రధానంగా కేంద్రీకృతం అయిందన్నారు. "యువ శక్తి నిర్మాణం, యువ శక్తి ద్వారా బలమైన, సమర్థమైన భారత్ నిర్మాణం అన్న అంశాల మీదే మేం మాట్లాడుకున్నాం" అని శ్రీ మోదీ వెల్లడించారు.

ఆ నాటి సమావేశం ముగిసిన తరువాత కొన్ని సంవత్సరాలకు గుజరాత్ రాష్ట్రానికి తాను ముఖ్యమంత్రి అయింది మొదలు, గత 25 ఏళ్లుగా ప్రజలకు నిలకడగా సేవలను అందిస్తూ వస్తున్న సంగతిని ప్రధానమంత్రి ప్రస్తావించారు. ఇంతకాలంలో తాను అనుసరిస్తున్న విధానాల్లో యువతకు కేంద్ర స్థానాన్నిస్తూ వచ్చినట్లు తెలిపారు. ప్రధాన బాధ్యతలను భుజస్కంధాలపై వేసుకొని 300 రోజులుపాటు 40,000 కిలోమీటర్లు చుట్టి ఒక లక్ష కన్నా ఎక్కువ మంది యువజనులను కూడగట్టినందుకు చిన్మయ అమృత్ మహోత్సవ్ యువ స్వచ్ఛంద సేవకులను ప్రధాని ప్రశంసించారు. "ఈ అద్భుత ప్రయత్నాన్ని నెరవేర్చినందుకు పూర్తి జట్టును కూడా నేను అభినందిస్తున్నాను" అని ప్రధాని శ్రీ మోదీ అన్నారు.

వయం అమృతస్య పుత్రః (మనం అమరత్వ బాలలం) అన్న ఉపనిషద్సూక్తిని ప్రధానమంత్రి ప్రస్తావిస్తూ, భారత్ వేల సంవత్సరాలుగా జ్ఞానం, కాంతుల అన్వేషకురాలుగా ఉందనీ, దేశ చేతన, వివేకం శాశ్వతత్వాన్ని కలిగివుండటమే దీనికి కారణమనీ ప్రధానమంత్రి అన్నారు. ఇదే తనకు, స్వాతంత్ర్య 75వ వార్షికోత్సవ ఘట్టంతో 'వికసిత్ భారత్' దిశగా దూసుకుపోవడానికి శుభారంభం చేద్దామనీ, సహస్రాబ్దుల నుంచీ మానవ జాతి శ్రేయం కోసం తపిస్తున్న భారత్‌ను పునరుద్ధరిద్దామనీ పిలుపునివ్వడానికి స్ఫూర్తిని అందించిందనీ ఆయన తెలిపారు. అది మొదలు అసంఖ్యాక ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సామాజిక సంస్థలు అనేక ముఖ్య సందర్భాల్లో పవిత్ర ప్రతిజ్ఞ పాఠాలను స్వీకరించాయని ఆయన తెలిపారు. దేశ అమృత్ కాల్ ప్రచార ఉద్యమంలో చిన్మయ మిషన్ మమేకం కావడం భేషుగ్గా ఉందని ఆయన అన్నారు. "మనం అమృతస్య పుత్రః గా నిలిచామనడానికిదే అసలైన నిదర్శనం" అని శ్రీ మోదీ అన్నారు.

దేశ ప్రజల జాగృతినీ, ఉన్నతినీ దృష్టిలో పెట్టుకొని "వయం రాష్ట్రే జాగ?మయ పురోహితః" అన్న వేదోక్తిని ప్రధానమంత్రి ఉదాహరించారు. స్వామి చిన్మయానంద ఆధ్యాత్మికతపై ఎంత ధారాళంగా ప్రసంగించే వారో జాతీయ ప్రాధాన్యాల విషయంలోనూ అంతే వాగ్ధాటిని కనబరిచారని ప్రధాని అన్నారు. దేశమంటే మన సంస్కృతికి, మన ఉనికికి పట్టుగొమ్మనీ, ఇందువల్ల ఆధ్యాత్మిక ఉన్నతి వ్యక్తిగత అభివృద్ధికీ, దేశ ప్రగతికీ దన్నుగా నిలవాలని స్వామీజీ బోధించే వారని శ్రీ మోదీ అన్నారు. జాతీయ ఆత్మగౌరవాన్ని ప్రజలలో పాదుగొల్పే నిమిత్తం స్వామీజీ గీతా జ్ఞాన యజ్ఞాన్ని ప్రారంభించి ఉపనిషత్తుల్నీ, వేదాంతాన్నీ, ధర్మ గ్రంథాల్నీ సామాన్యులకు చేరువగా తీసుకువచ్చారనీ, ఇవాళ లక్షల మంది చిన్మయ మిషన్ యువత సాంస్కృతిక రాయబారులుగా మారి భారతీయ విలువల ప్రచారంలో పాలుపంచుకుంటున్నారంటే అది ఆ కార్యక్రమ ఫలితమనీ ప్రధానమంత్రి అన్నారు. "పూజ్య గురుదేవులు అందించిన ఈ తోడ్పాటు భారతదేశ సాంస్కృతిక, ఆధ్యాత్మిక పునరుజ్జీవనంలో ఓ ముఖ్య అధ్యాయమని చెప్పి తీరాలి" అని ప్రధానమంత్రి శ్రీ మోదీ అన్నారు.

2015లో గురుదేవ్ శత జయంతి సందర్భంగా స్మారక నాణేన్ని విడుదల చేసిన విషయాన్ని ప్రధానమంత్రి ప్రస్తావించారు. స్వామి చిన్మయానంద జీవితాన్ని జ్ఞానం, కర్మ, భక్తిల అద్భుత సమ్మేళనంగా అభివర్ణించారు. ఆయన గురు స్వామి శివానంద ఇచ్చిన "వెళ్లు, సింహంలా గర్జించు" ఆశీర్వాదాన్ని స్వామీజీ తన జీవితంలో సార్థకం చేశారని పేర్కొన్నారు. స్వామీజీ అంతర్గత విశ్వాసం, ఆయన ప్రసంగాలను వినేవారిపై చెరగని ముద్ర వేసిందని.. ఆయన నిర్వహించిన 'ఆర్ట్ ఆఫ్ మ్యాన్ మేకింగ్' రేడియో కార్యక్రమం ఎంతో మంది జీవితాలకు మార్గదర్శకంగా నిలిచిందని తెలిపారు. "స్వామీజీ స్వరంలో ఉన్న ఆత్మవిశ్వాసం, అంతర్గతంగా ఉన్న శక్తి ప్రతి ఒక్కరి హృదయంలో ఆయన ఆలోచనల ముద్ర వేసేవి" అని ప్రధానమంత్రి శ్రీ మోదీ పేర్కొన్నారు.

గొప్ప వ్యక్తుల ఆశయాలు వారు జీవించి ఉన్న కాలానికే పరిమితం కావని, వారి జీవితకాలం తర్వాత కూడా కొనసాగుతాయని ప్రధానమంత్రి పేర్కొన్నారు. చిన్మయ మిషన్ దేశవ్యాప్తంగా విస్తృతమైన విద్యా వ్యవస్థను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ.. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 100కు పైగా చిన్మయ విద్యాసంస్థలు లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నాయని తెలిపారు. "ఈ విద్యాసంస్థల్లో విద్యార్థులు ఆధునిక విద్యను అభ్యసించడంతోపాటు భారతీయ విలువలను కూడా అలవర్చు కుంటున్నారు" అని ప్రధాని శ్రీ మోదీ పేర్కొన్నారు.

స్వామి చిన్మయానంద వంటి మేధావులు స్వాతంత్ర్యానంతరం కలలుగన్న దేశ దార్శనికతకు అనుగుణంగా ప్రస్తుత పాలన సాగుతోందని ప్రధానమంత్రి తెలిపారు. నూతన భారత్ నిర్మాణంలో భాగంగా విద్యా వ్యవస్థను ఆధునికీకరించాల్సిన బాధ్యతను దేశం చురుకుగా నిర్వర్తిస్తోందని పేర్కొన్నారు. భారతీయ జ్ఞాన సంప్రదాయం, మాతృభాషలో విద్య, ఆధునిక విజ్ఞానశాస్త్రం, సాంకేతికతలను సమన్వయం చేసే జాతీయ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టిన విషయాన్ని ప్రస్తావించారు. "ఈ నూతన విద్యా విధానంలో వీటన్నింటికీ ప్రాధాన్యత కల్పించాం" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

భారతీయ వారసత్వ పరిరక్షణకు స్వామీజీ జీవితాంతం అంకితమయ్యారని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. కన్యాకుమారి వద్ద సముద్రంలో వివేకానంద రాక్ మెమోరియల్ నిర్మించాలన్న ఏకనాథ్ రానడే సంకల్పానికి గురుదేవ్ స్వామి చిన్మయానంద మద్దతుగా నిలిచారని గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టు కోసం తొలిసారిగా ఆర్థిక సహకారం అందించింది కూడా ఆయనేనని తెలిపారు. నేడు ఈ స్మారక కట్టడం ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని పేర్కొన్నారు. "భారతీయ వారసత్వంపై గర్వం కలిగి ఉండటం, దానిని పరిరక్షించడం కూడా స్వామీజీ జీవిత లక్ష్యాల్లో ఒకటి" అని ప్రధాని శ్రీ మోదీ అన్నారు.

దేశంలో ఉత్తరం నుంచి దక్షిణం వరకు, తూర్పు నుంచి పడమర వరకు విస్తరిస్తున్న గొప్ప సాంస్కృతిక పునరుజ్జీవనాన్ని ప్రస్తావిస్తూ.. కాశీ విశ్వనాథ ధామ్, అయోధ్యలోని శ్రీరామ మందిరం, ఉజ్జయినిలోని మహాకాళ్ మహాలోక్, కేదార్‌నాథ్, బద్రీనాథ్ వంటి పుణ్యక్షేత్రాల అభివృద్ధి, పునరుద్ధరణతోపాటు సాంస్కృతిక ప్రదేశాలకు యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో చోటు లభించడాన్ని ప్రధానమంత్రి వివరించారు. గతంలో భారత్‌కు చెందిన పురాతన కళాఖండాలు దొంగతనానికి గురై.. ఎలాంటి ప్రతిఘటన లేకుండానే విదేశాల్లో విక్రయించిన పరిస్థితులను గుర్తుచేశారు. గత పన్నెండేళ్లలో భారతీయ వారసత్వ సంపదను తిరిగి స్వదేశానికి తీసుకువచ్చిన విషయాన్ని ఆయన వివరించారు. "గత 12 ఏళ్లలో 650కు పైగా ఇటువంటి పురాతన విగ్రహాలను కూడా మనం తిరిగి తీసుకువచ్చాం" అని శ్రీ మోదీ తెలిపారు.

భారతీయ తత్వశాస్త్రాన్ని స్వామీజీ ప్రపంచానికి పరిచయం చేసిన విధానాన్ని, నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రపంచ దేశాలను భారత్‌తో అనుసంధానిస్తున్న తీరుతో పోల్చుతూ ప్రధానమంత్రి మాట్లాడారు. భారతీయ వారసత్వం పట్ల దేశంలో పెరుగుతున్న గర్వభావం, వలసవాద మనస్తత్వం నుంచి బయటపడటం వంటివి ప్రాచీన ఋషులు, దేశభక్తులు చూపిన మార్గంలో భారత్ ముందుకు సాగుతోందనడానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ ప్రయాణంలో వారి వేధో వారసత్వమే దేశానికి అతిపెద్ద బలమని ఆయన స్పష్టం చేశారు. "మన వారసత్వం పట్ల గర్వం కలిగించే ఈ ఆత్మవిశ్వాసం, బానిస మనస్తత్వం నుంచి విముక్తి పొందామనే ఈ నమ్మకం.. దేశం ఇప్పుడు ఆ మార్గంలో ముందుకు సాగుతోందనడానికి నిదర్శనం" అని శ్రీ మోదీ అన్నారు.

వివిధ సంస్థలు వేరు వేరు లక్ష్యాల కోసం పనిచేస్తున్నప్పటికీ.. అవన్నీ దేశ అభివృద్ధి, కీర్తి అనే ఒకే గమ్యాన్ని చేరుకుంటాయని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు. స్వామి చిన్మయానంద తన కాలంలోని సవాళ్లకు అనుగుణంగా తన సంకల్పాలను రూపొందించుకున్నట్లుగానే, నేటి తరం కూడా ఆధునిక సమాజంలో నెలకొన్న వక్రధోరణులు, సవాళ్లను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. సమాజాన్ని విభజించే శక్తులకు వ్యతిరేకంగా ప్రజలందరినీ ఐక్యం చేయడం, స్వావలంబనను ప్రోత్సహించడం, 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంతో ప్రతి పౌరుడిని అనుసంధానించడం కోసం చురుకైన చర్యలు చేపట్టాలని సూచించారు. "సమాజాన్ని విభజించే శక్తులకు వ్యతిరేకంగా నేడు మనమంతా ఐక్యం కావాలి" అని ప్రధానమంత్రి శ్రీ మోదీ అన్నారు.

2047లో భారత్ స్వాతంత్ర్యం సాధించి 100 ఏళ్లు పూర్తిచేసుకునే సమయంలోనే, చిన్మయ మిషన్ శతాబ్ది ఉత్సవాలు కూడా జరగడం ఒక చారిత్రాత్మక కలయికగా ప్రధానమంత్రి అభివర్ణించారు. ఈ రెండు ప్రయాణాల లక్ష్యాలు ఒకటేనని, అవి కలిసి ముందుకు సాగాలని ఆకాంక్షించారు. చిన్మయ మిషన్‌కు చెందిన ప్రపంచవ్యాప్త ఆచార్యులు, ఆధ్యాత్మిక సాధకులు, స్వచ్ఛంద సేవకుల కుటుంబం.. గురుదేవుల వారసత్వాన్ని, దశాబ్దాల అనుభవాన్ని సద్వినియోగం చేసుకుని వికసిత్ భారత్ నిర్మాణానికి సహకరిస్తుందనే పూర్తి విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. చివరగా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. "చిన్మయ మిషన్ శతాబ్ది ప్రయాణం, వికసిత్ భారత్ నిర్మాణ ప్రయాణం రెండూ కలిసి ముందుకు సాగుతాయి" అని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు.

# మానేరు నదిలో మునిగి పంచాయతీ కార్యదర్శి మృతి

కరీంనగర్, అక్టోబర్ 24: నరదాగా మానేరు నదిలో స్నానం చేద్దామని దిగిన ఒక పంచాయతీ కార్యదర్శి మృతితో విషాదం నెలకొంది. శుక్రవారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు గ్రామం వద్ద మానేరు నదిలో రత్నాపూర్ గ్రామానికి చెందిన శనిగరపు జైపాల్ (32), ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు.

ఈ ఘటనలో ఆయన భార్య, మరదలు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో వారిని చికిత్స నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జైపాల్ ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా మంథని మండలం సూరయ్యపల్లి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నారు. దసరా పండుగ నిమిత్తం జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్లలోని అత్తగారింటికి వెళ్లిన ఆయన, తిరుగు ప్రయాణంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓడేడు మానేరు నది వద్దకు చేరుకున్నారు. భార్య, మరదలితో కలిసి నదిలో స్నానం చేస్తున్న సమయంలో అనుకోకుండా నీటి ఉధృతిలో చిక్కుకున్నారు. గమనించిన స్థానిక రైతు ఓగులవేన ఈశ్వరయ్య వెంటనే స్పందించి, నీటిలో కొట్టుకుపోతున్న వారిని బయటకు లాగేందుకు ప్రయత్నించారు.

# నేతాజీ విగ్రహ నిర్మాణానికి సహకరిస్తా

## ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జు హామీ



ఆదిలాబాద్, అక్టోబర్ 24:భారత స్వాతంత్ర్య సమరయోధుడు, మహా దేశభక్తుడు, ఇండియన్ ఆర్మీ రూపశిల్పి నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని కడెంలో జననీ జన్మభూమి స్టూడెంట్స్ అండ్ క్రైమ్ ఎరాడికేషన్ సొసైటీ (జేజేఎస్) ఆధ్వర్యంలో నిర్మించనున్నారు. గతంలో ప్రారంభమైన విగ్రహ నిర్మాణ పనులు కొన్ని కారణాల వల్ల ఆలస్యం కాగా, తాజాగా సభ్యులు మళ్లీ నిర్మాణ కార్యక్రమాలను చేపట్టారు.

ఈ నేపథ్యంలో జేజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొమురవెల్లి భూమేశ్, జిల్లా సభ్యులు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జును కలిసి విగ్రహ నిర్మాణ వివరాలు, వ్యయాన్ని వివరించి సహాయం కోరారు. స్పందించిన ఎమ్మెల్యే విగ్రహ నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే కార్యాలయంలో 'స్టాచ్యూ ఆఫ్ పేట్రియాటిజం' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేజేఎస్ సభ్యులు ఎమ్మెల్యే బొజ్జును శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా జేజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొమురవెల్లి భూమేశ్ మాట్లాడుతూ.. ఆహ్లాదకరమైన కడెం ప్రాజెక్టు సమీపంలో సుమారు రూ.6 లక్షల వ్యయంతో విగ్రహం, ఫౌండేషన్ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. దేశభక్తికి ప్రతీకగా నిలిచే ఈ విగ్రహ నిర్మాణ కార్యక్రమంలో దేశభక్తులు, నేతాజీ సుభాష్ చంద్రబోస్ అభిమానులు, నాయకులు, దాతలు భాగస్వాములు కావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జేజేఎస్ జిల్లా అధ్యక్షుడు చీమల భీమేశ్, సెక్రటరీ జనరల్ సీహెచ్ రాజేశ్ కుమార్, సభ్యులు గుంపుల విజయకుమార్, ఎనగందుల రాజశేఖర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

## బ్లాక్ స్పాట్లను పరిశీలించిన భైంసా ఏఎస్పీ సాయి కిరణ్



ఆదిలాబాద్, అక్టోబర్ 24: రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని భైంసా ఏఎస్పీ సాయి కిరణ్ సూచించారు. శనివారం బాసర పోలీస్‌స్టేషన్ పరిధిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్లను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రమాదాలకు గల కారణాలను విశ్లేషించి, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు.

అనంతరం జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులతో మాట్లాడారు. ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, రహదారి సూచికలు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే కారణాలను గుర్తించి నివారణ చర్యలు తీసుకోవడం ద్వారా ప్రాణనష్టాన్ని అరికట్టవచ్చని పేర్కొన్నారు.

రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు సంబంధిత శాఖల సమన్వయంతో ప్రమాదాల నివారణకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాసర పోలీస్ ఇన్‌స్పెక్టర్ దీపక్ పాల్గొన్నారు.




# కార్మిక చట్టాలు, కార్మిక సంక్షేమం మరియు సామాజిక భద్రతపై రెండు రోజుల రాష్ట్ర స్థాయి 'శ్రమ సంవాద్' కార్యక్రమం అక్టోబర్ 26న లక్నోలో ప్రారంభం కానుంది

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 24: భారత ప్రభుత్వ కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వ శాఖ, ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వ సహకారంతో, కార్మిక చట్టాలు, కార్మిక సంక్షేమం మరియు సామాజిక భద్రతపై రెండు రోజుల రాష్ట్ర స్థాయి సామర్థ్య పెంపు మరియు అవగాహన కార్యక్రమాన్ని 2026 అక్టోబర్ 26 మరియు 27 తేదీలలో ఉత్తర ప్రదేశ్‌లోని లక్నోలో నిర్వహించనుంది. కార్మిక సంస్కరణలపై జిల్లా స్థాయి సామర్థ్య పెంపు మరియు అవగాహనపై దృష్టి సారించే దేశవ్యాప్త "శ్రమ సంవాద్" చొరవలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

2026 సెప్టెంబర్ 28న దేశవ్యాప్తంగా ప్రారంభించబడిన 'శ్రమ్ సంవాద్' ప్రచారం, 90 రోజుల పాటు సాగే ఒక విస్తృత ప్రచార కార్యక్రమం. దీని ద్వారా మంత్రిత్వ శాఖ, 36 రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాలలోని 316 జిల్లాలలో, ముఖ్యంగా పారిశ్రామిక సమూహాలపై ప్రత్యేక దృష్టి సారించి, జిల్లా స్థాయిలో ప్రజలను కలుపుకొని పోతోంది. ఈ కార్యక్రమం యొక్క లక్ష్యం, కొత్త కార్మిక చట్టాలలోని నిబంధనలు, వాటి వర్తింపు, మరియు పాటించవలసిన నియమాలపై యజమానులకు మరియు ఇతర భాగస్వాములకు మరింత స్పష్టతను అందించడం, తద్వారా క్షేత్రస్థాయిలో సమర్థవంతమైన అమలుకు వీలు కల్పించడం. కార్యక్రమం యొక్క మొదటి రోజు 'కార్మిక సంస్కరణల'పై చర్చలు జరుగుతాయి, ఈ సందర్భంగా కార్మిక మరియు ఉపాధి శాఖ కార్యదర్శి కీలకోపన్యాసం చేస్తారు. రోజు మొదటి భాగంలోని కీలక సమావేశాలలో అంతర్జాతీయ కార్మిక చలనశీలత, అసంఘటిత మరియు గిగ్/ప్లాట్‌ఫామ్ కార్మికుల కోసం సామాజిక భద్రతా చర్యలు, మరియు భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల (బీఓసీడబ్ల్యూ) కోసం చేపట్టిన కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు.

ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వ కార్మిక మరియు ఉపాధి శాఖ మంత్రి, రోజు రెండవ భాగంలోని కీలక సమావేశాలలో ఒకదానిలో ప్రసంగిస్తారు. ఆ తర్వాత జరిగే సమావేశాలలో ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) మరియు ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) నుండి అంతర్దృష్టులను అందిస్తారు. ఈ-శ్రమ్, శ్రమ్ సువిధా పోర్టల్, సమాధాన్ మరియు లేబర్ స్టాక్ వంటి ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా కార్మికుల సంక్షేమం కోసం సాంకేతికతను ఉపయోగించుకోవడం యొక్క ప్రాముఖ్యతను, అలాగే రాష్ట్ర ప్రభుత్వం యొక్క ఉత్తమ పద్ధతులు మరియు అమలు వ్యూహాలను కూడా ఈ చర్చలు నొక్కి చెబుతాయి.

రెండవ రోజు 'కార్మిక చట్టాల అమలు మరియు భవిష్యత్ కార్యాచరణ'పై దృష్టి సారిస్తుంది. మంత్రిత్వ శాఖకు చెందిన సీనియర్ అధికారులు అధ్యక్షత వహించే సాంకేతిక సమావేశాలతో ఇది ప్రారంభమవుతుంది. రోజు మొదటి భాగంలో జరిగే చర్చలలో, నాలుగు కార్మిక కోడ్‌లైన వేతనాల కోడ్ (2019), పారిశ్రామిక సంబంధాల కోడ్ (2020), సామాజిక భద్రతా కోడ్ (2020), మరియు వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం మరియు పని పరిస్థితుల కోడ్ (2020) కింద పాటించాల్సిన చట్టబద్ధమైన నిబంధనల యొక్క స్థూల సమీక్ష మరియు సవివరమైన విశ్లేషణ ఉంటుంది. దీని తర్వాత, ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన మరియు ప్రధాన మంత్రి శ్రమ్ యోగి మాంధన్ యోజన వంటి ప్రధాన పథకాలపై ప్రత్యేక ప్రజెంటేషన్లు ఉంటాయి. రెండవ రోజు బాల కార్మిక నివారణ, రక్షణ, పునరావాసం, జిల్లా స్థాయి పర్యవేక్షణ, మరియు బాల ఉ వెట్టి చాకిరి నిర్మూలన కోసం రూపొందించిన వ్యూహాలపై కూడా దృష్టి సారిస్తారు. ఈ రెండు రోజుల సమావేశాలలో ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వ అధికారులు పాల్గొంటారు.

రెండు రోజుల పాటు జరిగే క్రమబద్ధమైన బహిరంగ చర్చా సమావేశాలు ఒక ప్రధాన అంశంగా ఉంటాయి. ఇవి, పాల్గొనేవారు మరియు పరిశ్రమ భాగస్వాములు లేవనెత్తిన కీలక కార్యాచరణ సమస్యలు, నియంత్రణ సమ్మతి మరియు ఆచరణాత్మక ప్రశ్నలను పరిష్కరించడానికి ఒక ఇంటరాక్టివ్ వేదికను అందిస్తాయి.

# అమెరికాలో విషాదం.. గుండెపోటుతో ఖమ్మం యువతి మృతి!

ఖమ్మం, అక్టోబర్ 24:అమెరికాలో ఉన్నత చదువులు పూర్తి చేసి, ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్న ఖమ్మం నగరానికి చెందిన ఓ తెలుగు యువతి గుండెపోటుతో అకస్మాత్తుగా మృతి చెందింది. ఈ విషాదకర ఘటన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తీవ్ర విషాదాన్ని నింపింది.

ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ఎగుమతి శాఖ అధ్యక్షుడు నల్లమల ఆనంద్ కుమార్తె నల్లమల అక్షిత (26) ఉన్నత చదువుల నిమిత్తం అమెరికా వెళ్లారు. న్యూయార్క్ సిటీలో మాస్టర్ ఆఫ్ సైన్స్ (ఓూ) పూర్తి చేసిన అక్షిత.. ప్రస్తుతం ఉద్యోగ వేటలో ఉన్నారు. అయితే, శుక్రవారం తెల్లవారుజామున ఆమెకు అకస్మాత్తుగా తీవ్రమైన గుండెపోటు వచ్చింది. తోటి విద్యార్థులు, స్థానికులు వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించినప్పటికీ, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు.

ఉన్నత చదువులు చదివి తమ కుటుంబానికి అండగా ఉంటుందని ఎన్నో ఆశలతో అక్షితను విదేశాలకు పంపిన తల్లిదండ్రులు, ఆమె అకాల మృతి వార్త విని తీవ్రగ్భ్రాంతికి గురయ్యారు. ఖమ్మం మమతా మెడికల్ కళాశాల రోడ్డులోని నల్లమల ఆనంద్ నివాసంలో ప్రస్తుతం విషాద ఛాయలు అలుముకున్నాయి. తమ కూతురు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయిందని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. అమెరికా నుండి అక్షిత భౌతిక కాయాన్ని స్వగ్రామానికి రప్పించేందుకు కుటుంబ సభ్యులు, సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నల్లమల ఆనంద్ కుమార్తె నల్లమల అక్షిత అమెరికాలో గుండెపోటుతో అకాల మరణం చెందడం పట్ల తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ తుమ్మల యుగంధర్ తీవ్రగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. నల్లమల ఆనందను ఫోన్ ద్వారా పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# వైద్య సేవల్లో ఆదర్శంగా నిలవాలి

## విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్

## సిరిసిల్ల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో వైట్ కోట్ సెర్మనీ



కరీంనగర్, అక్టోబర్ 24: వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు భవిష్యత్తులో ఉత్తమ వైద్యులుగా ఎదిగి, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో శనివారం నిర్వహించిన వైట్ కోట్ సెర్మనీకి కలెక్టర్, ఎస్పీ మహేష్ బి. గితె ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి, విద్యార్థులకు వైట్ కోట్లు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యం, విద్యకు సమాజంలో ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. నీట్‌లో ఉత్తీర్ణత సాధించి వైద్య విద్యలో ప్రవేశం పొందడం వెనుక విద్యార్థుల కృషితో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉంటుందని పేర్కొన్నారు. వైద్యులు గర్భిణులు, చిన్నారులు, వివిధ వ్యాధులతో బాధపడేవారికి ఓర్పుతో సేవలు అందించాలని సూచించారు. సమాజ సేవలో భాగంగా అవసరమైన వారికి ఉచిత వైద్య సేవలు అందించి ఆత్మసంతృప్తి పొందాలని, తమ ఆరోగ్యం, ఆహారంపై కూడా శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల, బాలుర హాస్టల్ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెల్లడించారు. బాలికల హాస్టల్ ఇప్పటికే వినియోగంలోకి వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ నిర్విష, తహసీల్దార్ మహేష్‌కుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# యువతకు ఊతం.. వారసత్వానికి రక్షణ

## 31న అగ్నివీర్, ఎస్ఎస్సీ జీడీ అభ్యర్థులకు ఉచిత వైద్య శిబిరం

## నవంబర్ 1న సీతమ్మలొద్ది ట్రెక్కింగ్.. పోస్టర్లు ఆవిష్కరించిన కలెక్టర్




కరీంనగర్, అక్టోబర్ 24:యువతలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు జిల్లా చారిత్రక వారసత్వ సంపదను పరిరక్షించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో అగ్నివీర్, ఎస్ఎస్సీ జీడీ అభ్యర్థుల కోసం నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరం, 'మన జిల్లా×-మన ఖిల్లా' కార్యక్రమంలో భాగంగా చేపట్టనున్న సీతమ్మలొద్ది ట్రెక్కింగ్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు.

**31న ఉచిత వైద్య శిబిరం**

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి హాజరయ్యే అగ్నివీర్, ఎస్ఎస్సీ జీడీ అభ్యర్థుల కోసం ఈ నెల 31న యువశక్తి? పెద్దపల్లి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. పెద్దపల్లి బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ శిబిరం జరగనుంది. వైద్య పరీక్షల్లో ఇబ్బందులు ఎదురుకాకుండా ముందుగానే ఆరోగ్య సమస్యలను గుర్తించి, అవసరమైన సలహాలు పొందేందుకు ఇది ఉపయోగపడనుంది. వివరాలకు 7780543055, 9182691655 నంబర్లను సంప్రదించాలి.

**నవంబర్ 1న సీతమ్మలొద్ది ట్రెక్కింగ్**

'మన జిల్లా-మన ఖిల్లా' కార్యక్రమంలో భాగంగా నవంబర్ 1న సీతమ్మలొద్ది ప్రాంతంలో ట్రెక్కింగ్ నిర్వహించనున్నారు. ఇప్పటికే 250 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ ప్రాంతంలోని ప్రాచీన గుహలు, ఆదిమానవుల ఆనవాళ్లు, పిడుగు తొర్ర, భీమన్న దేవాలయం వంటి విశేషాలను సందర్శకులకు పరిచయం చేయనున్నారు.

**మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి**

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరుచుకోవాలని కలెక్టర్ సూచించారు. ట్రెక్కింగ్ సందర్భంగా 'యెస్ ఫర్ లైఫ్? సే నో టు డ్రగ్స్' నినాదంతో అవగాహన కల్పించనున్నారు. చారిత్రక ప్రదేశాల పరిరక్షణలో యువత భాగస్వాములు కావాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో డీసీపీ రామ్‌రెడ్డి, డీఎంవో ప్రవీణ్‌రెడ్డి, మాజీ సైనికుడు, అంతర్జాతీయ పర్వతారోహకుడు లెంకల మహిపాల్‌రెడ్డి, ఫొటోగ్రాఫర్లు రవీందర్‌రెడ్డి, శీలం అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ గోయల్ బెర్లిన్ పర్యటనలో భారత్-జర్మనీ ఆర్థిక సహకారంపై దృష్టి

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 24:కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ తన రెండు రోజుల అధికారిక జర్మనీ పర్యటనను 23 అక్టోబర్ 2026న బెర్లిన్‌లో పలు కార్యక్రమాలతో ముగించారు. ఈ కార్యక్రమాలలో భాగంగా ఆయన సీనియర్ జర్మన్ ప్రభుత్వ అధికారులు, వ్యాపార ప్రముఖులు, పరిశోధనా సంస్థలు మరియు ప్రవాస భారతీయులతో సమావేశమయ్యారు. వాణిజ్యం, పెట్టుబడులు, అధునాతన తయారీ, పరిశోధన మరియు వర్ధమాన సాంకేతికతలలో భారత్-జర్మనీ సహకారాన్ని బలోపేతం చేయడంపై ఈ సమావేశాలు దృష్టి సారించాయి.

శ్రీ పీయూష్ గోయల్, జర్మన్ ఫెడరల్ ఛాన్సలరీలోని ఆర్థిక మరియు ద్రవ్య విధాన సలహాదారు మరియు జీ7/జీ20 షెర్పా అయిన శ్రీ లెవిన్ హోల్లేతో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఈ చర్చలలో, ద్వైపాక్షిక ఆర్థిక సహకారం మరియు భారతదేశం, జర్మనీల మధ్య ఆర్థిక, పెట్టుబడి సంబంధాలను మరింత బలోపేతం చేసే అవకాశాలపై దృష్టి సారించారు.

మంత్రి, సిమెన్స్ హెల్త్‌కేర్స్ ఏజీ సీఈఓ శ్రీ బెర్న్డ్ మాంటాగ్; బెర్టెల్స్‌మాన్ ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యుడు మరియు బెర్టెల్స్‌మాన్ ఇన్వెస్ట్‌మెంట్స్ సీఈఓ అయిన శ్రీ కార్స్టెన్ కోన్‌ఫెల్డ్; మరియు వోక్స్‌వ్యాగన్ ఏజీ సీఎఫ్ఓ, స్కోడా ఆటో సీఈఓ అయిన శ్రీ హోల్గర్ పీటర్స్‌లతో విడివిడిగా సమావేశమయ్యారు. ఈ సమావేశాలలో, ఇరు దేశాల మధ్య వ్యాపార భాగస్వామ్యాలు, పెట్టుబడులు మరియు పారిశ్రామిక సహకారాన్ని విస్తరించే అవకాశాలను అన్వేషించారు.

శ్రీ గోయల్, అధునాతన పారిశ్రామిక సాంకేతికతలు మరియు ఆవిష్కరణలలో సహకారంపై చర్చించడానికి, ప్రముఖ జర్మన్ పారిశ్రామిక పరిశోధనా సంస్థల నాయకులతో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో కూడా పాల్గొన్నారు. దీనికి అదనంగా, గోయల్‌తో పాటు వచ్చిన భారతీయ వ్యాపార ప్రతినిధి బృందంలోని సభ్యులు, ద్వైపాక్షిక వ్యాపార సహకారానికి అవకాశాలను అన్వేషించడానికి జర్మన్ పరిశ్రమ ప్రతినిధులు మరియు రంగాల సంఘాలతో జరిగిన రంగాల వారీ రౌండ్‌టేబుల్ సమావేశాలలో పాల్గొన్నారు.

శ్రీ గోయల్ బెర్లిన్‌లోని ప్రవాస భారతీయులతో కూడా సంభాషించి, మీడియాను ఉద్దేశించి ప్రసంగించారు.

పరిశోధన మరియు ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థతో తన సంప్రదింపులలో భాగంగా, శ్రీ గోయల్ జర్మనీలో ఉన్న భారతీయ శాస్త్ర, సాంకేతిక పరిశోధకులు మరియు విద్యార్థులతో సంభాషించారు. ఆయన మైక్రోఎలక్ట్రానిక్స్, పవర్ ఎలక్ట్రానిక్స్, లాజిస్టిక్స్, స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్, పారిశ్రామిక ఆవిష్కరణలు మరియు బ్యాటరీ టెక్నాలజీలు వంటి రంగాలను కవర్ చేస్తూ, ఎంపిక చేసిన ఫ్రాన్‌హోఫర్ ఇన్‌స్టిట్యూట్‌ల అధిపతులతో ఒక రౌండ్‌టేబుల్ సమావేశాన్ని కూడా నిర్వహించారు. ఈ చర్చలు భారతదేశం మరియు జర్మనీల మధ్య పరిశోధన సహకారాన్ని మరియు పరిశ్రమ-విద్యాసంస్థల భాగస్వామ్యాలను బలోపేతం చేయడానికి మార్గాలను అన్వేషించాయి.

ఈ సమావేశాలు, ముఖ్యంగా వాణిజ్యం, పెట్టుబడులు, మరియు ఇతర రంగాలలో భారతదేశం-జర్మనీ వ్యూహాత్మక భాగస్వామ్యం యొక్క పెరుగుతున్న పరిధిని నొక్కిచెప్పాయి.

# మత్తు వీడు.. భవిష్యత్తు చూడు

## మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించిన ఎల్లారెడ్డి డిఎస్పీ శ్రీనివాసరావు



నిజామాబాద్, అక్టోబర్ 24: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎల్లారెడ్డి డిఎస్పీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. తాడ్వాయి మండలంలోని సంతాయపేట గ్రామంలో శుక్రవారం ప్రజలకు సైబర్ నేరాలు, గంజాయి/మత్తు పదార్థాల దుష్పరిణామాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు బానిసకాకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆన్‌లైన్ మోసపూరిత ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింకుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, వ్యక్తిగత మరియు బ్యాంకింగ్ వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని తెలిపారు. సైబర్ మోసానికి గురైతే తక్షణమే 1903 సేవలను వినియోగించుకోవాలని కోరారు.

అలాగే రోడ్డు భద్రతా నియమాలు పాటించడం, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాల నిరోధకం తదితర అంశాలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సదాశివనగర్ సిఐ వీరయ్య, తాడ్వాయి ఎస్సై నరేష్, పోలీస్ సిబ్బందితో పాటు సుమారు 100 మంది గ్రామస్థులు పాల్గొన్నారు.

# ములుగు మండలంలోని కన్నాయిగూడెం గ్రామంలో పావురాల సుమలత ప్రథమ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన ముంజాల బిక్షపతి గౌడ్



ములుగు, అక్టోబర్ 24:(నేటినిజం ప్రతినిధి): ములుగు మండలంలోని కన్నాయిగూడెం గ్రామంలో పావురాల సుమలత ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటం వద్ద పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించిన పూర్వ పిడిఎస్ యు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ములుగు జిల్లా అధ్యక్షులు ముంజాల బిక్షపతి గౌడ్ నివాళులర్పించడం జరిగినది అనంతరం ముంజల బిక్షపతి గౌడ్ మాట్లాడుతూ సుమలత అక్క ప్రగతిశీల మహిళా సంఘం పి ఓ డబ్ల్యు మహిళా సంఘంలో పనిచేసినరని మహిళల సమస్యల పైన ఉద్యమాలు నిర్వహించేవారు అని ముంజల అన్నారు వరకట్న దురాచారాలకు వ్యతిరేకంగా స్త్రీలపై జరుగుతున్న అత్యాచార్యులకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహించిన చరిత్ర సుమలతక్కకు ఉన్నదని ముంజల అన్నారు గత సంవత్సరం ప్రమాదంలో సునీతక్క మరణించడం జరిగినదని ముంజల అన్నారు అమరవీరుల ఆశయాలు కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు రాకేష్ ఆగబోయిన రమేష్ తాళ్ల పెల్లి శ్రీనివాస్ కల్లేపల్లి రమేష్ జన్ను శ్రీనివాస్ పి ఓ డబ్ల్యు మహిళా సంఘం నాయకురాలు తాళ్లపల్లి స్వరూప పునుగొండ్ల రమ యలం రామ ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సామ పూలక్క సామ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# నిర్ణీత గడువు కంటే ఐదు నెలల ముందే 11 కోట్ల రైతు ఐడీల సృష్టి, డిజిటల్ వ్యవసాయంలో ఒక ప్రధాన మైలురాయి: శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్

న్యూఢిల్లీ, అక్టోబర్ 24:డిజిటల్ వ్యవసాయంలో ఒక ప్రధాన మైలురాయిగా, భారత ప్రభుత్వం 31 మార్చి 2027 గడువు కంటే ఐదు నెలల ముందే 11 కోట్ల రైతు ఐడీలను సృష్టించాలనే తన లక్ష్యాన్ని సాధించింది. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్, ఈ విజయాన్ని, సంపన్న రైతులతో కూడిన అభివృద్ధి చెందిన భారతదేశమనే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతను సాకారం చేసే దిశగా ఒక ముఖ్యమైన ముందడుగుగా అభివర్ణించారు. వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ కింద ఈ మైలురాయిని సాధించడం జరిగింది. ఫార్మర్ ఐడి కార్యక్రమం, రైతులకు ఒక ప్రత్యేకమైన డిజిటల్ గుర్తింపును అందించడానికి రూపొందించబడింది. ఇది ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు, పంటల బీమా మరియు విపత్తు సహాయాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా మరియు సకాలంలో పొందేందుకు వీలు కల్పిస్తూ, అదే సమయంలో కాగితపు పనిని మరియు పునరావృత ధృవీకరణను తగ్గిస్తుంది.



# శ్రీనగర్‌లో అటవీ హక్కుల చట్టం అమలుపై మూడవ ప్రాంతీయ సమీక్షా సమావేశం జరిగింది




న్యూ ఢిల్లీ, అక్టోబర్ 24:భారత ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ , షెడ్యూల్డ్ తెగలు మరియు ఇతర సాంప్రదాయ అటవీ నివాసుల (అటవీ హక్కుల గుర్తింపు) చట్టం, 2006 అమలుపై మూడవ ప్రాంతీయ సమీక్షా సమావేశాన్ని ఈరోజు జమ్మూ ఁ కాశ్మీర్ లోని శ్రీనగర్‌లో నిర్వహించింది. మహారాష్ట్ర, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, గోవా, రాజస్థాన్ మరియు జమ్మూ ఁ కాశ్మీర్‌కు చెందిన సీనియర్ అధికారులు అమలు పురోగతిని సమీక్షించారు, సవాళ్లపై చర్చించారు మరియు ప్రాధాన్యతా చర్యలను గుర్తించారు. 10 సెప్టెంబర్ 2026న బెంగళూరులో జరిగిన మొదటి సమావేశం మరియు 9 అక్టోబర్ 2026న కోల్‌కతాలో జరిగిన రెండవ సమావేశం తరువాత, ఈ సమావేశంతో ప్రాంతీయ సమీక్షా పరంపర ముగిసింది.

జమ్మూ & కాశ్మీర్ ప్రభుత్వ గిరిజన వ్యవహారాల శాఖ డైరెక్టర్ శ్రీ మొహమ్మద్ ముంతాజ్ అలీ స్వాగతోపన్యాసం చేస్తూ, ఈ ప్రాంతంలోని కష్టతరమైన భూభాగం, చెల్లాచెదురుగా ఉన్న నివాసాలు, కాలానుగుణంగా జరిగే పశుపోషణ కదలికలు, మరియు స్థానికంగా తగిన పరిపాలనా ఏర్పాట్ల ఆవశ్యకతను నొక్కి చెప్పారు.

జమ్మూ ఁ కాశ్మీర్ ప్రభుత్వ గిరిజన వ్యవహారాలు, జలశక్తి మరియు అటవీ, జీవావరణ ఁ పర్యావరణ శాఖల గౌరవనీయ మంత్రి శ్రీ జావేద్ అహ్మద్ రాణా, అటవీ హక్కుల చట్టం అడవులపై ఆధారపడిన వర్గాల గౌరవాన్ని, జీవనోపాధిని మరియు భవిష్యత్తును కాపాడుతుందని నొక్కి చెప్పారు. ఆయన పారదర్శకంగా మరియు సకాలంలో క్లెయిమ్‌ల పరిష్కారం, శాఖల మధ్య బలమైన సమన్వయం మరియు గ్రామసభల భాగస్వామ్యాన్ని పెంచాలని పిలుపునిచ్చారు. అటవీ హక్కుల గుర్తింపు, పరిరక్షణ మరియు సుస్థిర అభివృద్ధి కలిసి ముందుకు సాగాలని ఆయన నొక్కి చెప్పారు.

ప్రధానోపన్యాసంలో, అటవీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఓసీం) సంయుక్త కార్యదర్శి శ్రీ అనంత్ ప్రకాష్ పాండే, 31 ఆగస్టు 2026 నాటికి, దేశవ్యాప్తంగా సుమారు 54 లక్షల క్లెయిమ్‌లు అందినట్లు, వాటిలో 43.56 లక్షలు (80.64%) పరిష్కరించబడినట్లు, దాదాపు 238 లక్షల ఎకరాలకు గాను 25.42 లక్షల టైటిళ్లు పంపిణీ చేయబడినట్లు, 10.45 లక్షల క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నట్లు మరియు 18.13 లక్షలు తిరస్కరించబడినట్లు నివేదించారు. ప్రతి తిరస్కరణకు దావాదారునికి తెలియజేసిన, కారణాలతో కూడిన ఉత్తర్వు తప్పనిసరిగా ఉండాలని, చట్టబద్ధమైన అప్పీల్ హక్కులు పరిరక్షించబడాలని ఆయన నొక్కిచెప్పారు. అలాగే, ముఖ్యంగా గుజరాత్, మహారాష్ట్ర, గోవా మరియు హిమాచల్ ప్రదేశ్‌లలో పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను వేగవంతం చేయుడానికి మరియు తిరస్కరించబడిన కేసులను సమీక్షించడానికి జిల్లా వారీ ప్రణాళికలను సిద్ధం చేయాలని రాష్ట్రాలను కోరారు.

కమ్యూనిటీ ఫారెస్ట్ రిసోర్స్ రైట్స్ ను ప్రముఖంగా ప్రస్తావిస్తూ, 27 జూలై 2026 నాటి ఓసీం మరియు పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖల సంయుక్త ప్రకటన ద్వారా సాధ్యమైన విధంగా, కమ్యూనిటీ ఫారెస్ట్ రిసోర్స్ రైట్స్ యొక్క సుస్థిర నిర్వహణ మరియు అఈఖీ నిర్వహణ ప్రణాళికలను అటవీ శాఖ కార్యాచరణ ప్రణాళికలతో అనుసంధానించాలని ఆయన పిలుపునిచ్చారు. గుర్తింపు పొందిన హక్కులను రెవెన్యూ రికార్డులలో పొందుపరచడం ద్వారా ఖఓ-ఐమెంటె మరియు వ్యవసాయ, మత్స్య మరియు జీవనోపాధి పథకాలకు ప్రాప్యతను సులభతరం చేయవచ్చు. దేశంలోని 75 ప్రత్యేకంగా బలహీన గిరిజన సమూహాలలో కేవలం 11 సమూహాలకు మాత్రమే ఇప్పటివరకు హక్కులు గుర్తించబడ్డాయని పేర్కొంటూ, ఖఒఉల కోసం ఆవాస హక్కుల గుర్తింపును వేగవంతం చేయాలని ఆయన రాష్ట్రాలను కోరారు. ఇతర ప్రాధాన్యతలలో త్రైమాసిక రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశాలు, క్రమం తప్పని నెలవారీ పురోగతి నివేదికలు, అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేస్‌ల ద్వారా రాష్ట్ర ఈఖీం రికార్డులను జాతీయ పోర్టల్‌తో అనుసంధానించడం, మరియు అవగాహన మరియు సామర్థ్య పెంపు కోసం తిఉూలో ఉచిత ఈఖీం కోర్సులను ఉపయోగించడం వంటివి ఉన్నాయి. శ్రీమతి. (రైతు మరియు గిరిజన మంత్రిత్వ శాఖ) డైరెక్టర్ సమీధా సింగ్, ఈఖీం మ్యాపింగ్ కోసం 'సపోర్ట్ టు ట్రైబల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్' పథకం కింద ప్రతి రాష్ట్రానికి -25 లక్షలు, ఆం-ఏఉజం కింద ప్రతి కమ్యూనిటీ ఫారెస్ట్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ ప్లాన్‌కు -15 లక్షలు, మరియు సాంకేతిక మద్దతు కోసం -1 లక్ష ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వివరించారు. 5 జనవరి 2026 నాటి మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల ప్రకారం ఖఒఉ (ప్రత్యేక అవసరాలు గల గిరిజన తెగలు) ఆవాస హక్కులకు మద్దతు ఇస్తున్నట్లు కూడా ఆమె హైలైట్ చేశారు. డేటా వ్యత్యాసాలను సరిదిద్దాలని, గ్రామ సభలను బలోపేతం చేయాలని, అవగాహన పెంచాలని, క్లెయిమ్ అనంతర మద్దతు అందించాలని మరియు అఈఖీ నిర్వహణ ప్రణాళికలను సులభతరం చేయాలని ఆమె రాష్ట్రాలను కోరారు.

## లక్షెట్టిపేట అభివృద్ధికి రూ.45 లక్షలు

### సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ అంజలి

ఆదిలాబాద్, అక్టోబర్ 24: లక్షెట్టిపేట పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని మున్సిపల్ చైర్మన్ దొంతు అంజలి నరసయ్య తెలిపారు.

ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు సహకారంతో ప్రభుత్వ నిధులు మంజూరవుతున్నాయని పేర్కొన్నారు. ఇందులో భాగంగా శనివారం రూ.45 లక్షలతో చేపట్టనున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. మున్సిపాలిటీ పరిధిలోని పానుగంటి లక్ష్మి ఇంటి నుంచి గడిగొప్పుల వెంకన్న ఇంటి వరకు ఈ రోడ్డు నిర్మించనున్నట్లు చైర్మన్ తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడంతో పాటు వార్డుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఇటిక్యాల గ్రామంలోనూ స్థానిక పెద్దలు, పీఏసీఎస్ చైర్మన్ చల్లా నాగభూషణం సహకారంతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెట్టెం శ్రీనివాస్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ గొల్ల కాంతయ్య, కాంగ్రెస్ నాయకులు గడిగొప్పుల కిష్టన్న, కట్ల చంద్రయ్య, చెన్న ప్రదీప్, మల్యాల శివ, పెట్టెం కోమరయ్య తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులకు వ్యాస రచన పోటీలు

### ప్రజానుకూల పోలీసింగ్, సామాజిక బాధ్యతపై అవగాహన

కరీంనగర్, అక్టోబర్ 24:పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు జరిగిన ఈ పోటీల్లో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించడం, సామాజిక బాధ్యతను గుర్తుచేయడం, ప్రజాసేవ పట్ల నిబద్ధతను బలోపేతం చేయడం, ప్రజానుకూల పోలీసింగ్‌పై అవగాహన కల్పించడం లక్ష్యంగా పోటీలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ వరకు సివిల్, ఏఆర్ సిబ్బందికి ప్రజలు పోలీసుల నుంచి ఆశించే సేవలు, పోలీసు అధికారుల జీవితాల్లో సామాజిక మాధ్యమాల పాత్ర, వాటిని సద్వినియోగం చేసుకునే విధానాలపై పోటీలు నిర్వహించారు. ఎస్ఐ, ఆర్ఎస్ఐ, ఆపై హోదా అధికారులకు ప్రజల గౌరవం, ఆదరణ పొందేందుకు తీసుకోవాల్సిన చర్యలు, క్షేత్రస్థాయిలో పోలీసింగ్‌ను బలోపేతం చేసే మార్గాలపై వ్యాసరచన నిర్వహించారు. ఈ పోటీల ద్వారా అధికారులు, సిబ్బంది తమ ఆలోచనలు, అనుభవాలు, విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను పంచుకోవడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించే మార్గాలను వివరించే అవకాశం కల్పించారు.

## బెర్లిన్‌లో జర్మన్ పారిశ్రామిక నాయకులు, పరిశోధన సంస్థలతో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ సమావేశం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 24:కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ జర్మనీలో తన రెండు రోజుల అధికారిక పర్యటనను 2026 అక్టోబర్ 23న ముగించారు. బెర్లిన్‌లో ఆయన జర్మనీ ప్రభుత్వ ఉన్నతాధికారులు, పారిశ్రామిక రంగ ప్రముఖులు, పరిశోధనా సంస్థల ప్రతినిధులు, ప్రవాస భారతీయులతో వరుస సమావేశాలు నిర్వహించారు. భారత్?జర్మనీ మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, అధునాతన తయారీ రంగం, పరిశోధన, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేయడంపై ఈ సమావేశాల్లో ప్రధానంగా చర్చించారు.

జర్మనీ ఫెడరల్ ఛాన్సలరీలో ఆర్థిక, ఆర్థిక విధాన సలహాదారుగా, జీ7/జీ20 షెర్పాగా వ్యవహరిస్తున్న లెవిన్ హోల్లేతో పీయూష్ గోయల్ ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. భారత్?జర్మనీ మధ్య ఆర్థిక సహకారం, ఆర్థిక సంబంధాలు, పెట్టుబడుల బంధాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఉన్న అవకాశాలపై ఇరువురూ చర్చించారు.

సీమెన్స్ హెల్తినీర్స్ ఏజీ సీఈఓ బెర్న్డ్ మోంటాగ్, బెర్టెల్స్‌మన్ సంస్థ ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యుడు, బెర్టెల్స్‌మన్ ఇన్వెస్ట్‌మెంట్స్ సీఈఓ కార్స్టెన్ కోస్ఫెల్డ్, వోక్స్‌వ్యాగన్ ఏజీ సీఎఫ్ఓ, స్కోడా ఆటో సీఈఓ హోల్గర్ పీటర్స్‌తో మంత్రి విడివిడిగా సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య వ్యాపార భాగస్వామ్యాలు, పెట్టుబడులు, పారిశ్రామిక సహకారాన్ని విస్తరించే అవకాశాలను ఈ సమావేశాల్లో పరిశీలించారు.

అధునాతన పారిశ్రామిక సాంకేతిక పరిజ్ఞానాలు, ఆవిష్కరణల రంగాల్లో సహకారంపై చర్చించేందుకు ప్రముఖ జర్మన్ పారిశ్రామిక పరిశోధనా సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలోనూ శ్రీ పీయూష్ గోయల్ పాల్గొన్నారు. ఆయనతో పాటు పర్యటించిన భారతీయ వ్యాపార ప్రతినిధి బృందం సభ్యులు జర్మన్ పారిశ్రామిక రంగ ప్రతినిధులు, వివిధ రంగాల సంఘాలతో నిర్వహించిన ప్రత్యేక రౌండ్‌టేబుల్ సమావేశాల్లో పాల్గొని, ఇరు దేశాల మధ్య వ్యాపార సహకారాన్ని విస్తరించే అవకాశాలను పరిశీలించారు.

బెర్లిన్‌లోని ప్రవాస భారతీయులతో శ్రీ పీయూష్ గోయల్ సమావేశమయ్యారు. అనంతరం ఆయన మీడియాతో కూడా మాట్లాడారు.

పరిశోధన, ఆవిష్కరణల రంగానికి సంబంధించి చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా జర్మనీలో ఉన్న భారతీయ శాస్త్ర, సాంకేతిక పరిశోధకులు, విద్యార్థులతో శ్రీ పీయూష్ గోయల్ సంభాషించారు. ఎంపిక చేసిన ఫ్రాన్‌హోఫర్ పరిశోధనా సంస్థల అధిపతులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సూక్ష్మ ఎలక్ట్రానిక్స్, పవర్ ఎలక్ట్రానిక్స్, లాజిస్టిక్స్, స్మార్ట్ తయారీ, పారిశ్రామిక ఆవిష్కరణలు, బ్యాటరీ సాంకేతిక పరిజ్ఞానాలు వంటి అంశాలు ఈ సమావేశంలో చర్చకు వచ్చాయి. భారత్-జర్మనీ మధ్య పరిశోధనా సహకారాన్ని బలోపేతం చేయడం, పరిశ్రమలు-విద్యాసంస్థల మధ్య భాగస్వామ్యాలను విస్తరించడం వంటి అవకాశాలపై చర్చించారు. వాణిజ్యం, పెట్టుబడులు, అధునాతన తయారీ, శాస్త్ర, సాంకేతికత, పరిశోధన, పారిశ్రామిక సహకారం వంటి రంగాల్లో భారత్?జర్మనీ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు ఉన్న అవకాశాలను ఈ పర్యటనలోని కార్యక్రమాలు స్పష్టం చేశాయి.

## యువత మత్తు వ్యసనాలకు దూరంగా ఉండాలి

### డ్రగ్స్ నివారణకు ప్రత్యేకంగా ఈగల్ బృందాలు-ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



మహబూబ్‌నగర్, అక్టోబర్ 24:యువత మత్తు పదార్థాలకు, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఖానాపూర్ ఎమ్మెల్యే, నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు వెడ్మ బొజ్జు పటేల్ సూచించారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని స్టార్ ఫంక్షన్ హాల్‌లో ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన యువత అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మత్తు వ్యసనాలకు బానిసై యువత తమ జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. కష్టపడి ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు అండగా నిలుస్తూ సమాజంలో మంచి పేరు సంపాదించాలని సూచించారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేకంగా ఈగల్ బృందాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. యువతకు మంచి భవిష్యత్తు కల్పించేందుకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, సామాజిక కార్యకర్త ముంతాజ్ బియ్యబా, కాంగ్రెస్ నాయకులు అన్సారీ, ఫహీమ్, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యం

### యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భూమిపూజకు ఏర్పాట్లు పూర్తి



కరీంనగర్, అక్టోబర్ 24: ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇస్తోందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు.

జగిత్యాల నియోజకవర్గంలోని తాటిపల్లి, మొరపల్లి శివారులో 25 ఎకరాల్లో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భూమిపూజకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో శనివారం ఎమ్మెల్యే స్థానిక నాయకులు, అధికారులతో కలిసి సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వసతి, భోజనం, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి సదుపాయాలను ఒకే ప్రాంగణంలో కల్పించడమే ఈ పాఠశాల లక్ష్యమన్నారు. సుమారు 2,500 మంది విద్యార్థులు, 500 మంది సిబ్బందికి అనుగుణంగా ఆధునిక వసతులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జగిత్యాలకు ఈ పాఠశాలను మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. భూమిపూజ కార్యక్రమానికి ప్రజలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొలుగూరి దామోదర్‌రావు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.




## గడువులోగా మెడికల్ కాలేజీ పనులు పూర్తి చేయాలి

### నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి: కలెక్టర్ సత్యప్రసాద్

కరీంనగర్, అక్టోబర్ 24:జగిత్యాలలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల



పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అధికారులను ఆదేశించారు.

శనివారం వారు కళాశాల నిర్మాణ పనులను పరిశీలించి, పురోగతిని సమీక్షించారు. కళాశాల భవనంతో పాటు హాస్టల్ బ్లాక్, కిచెన్, తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల్లో జాప్యం జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పెండింగ్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ వైద్య కళాశాల అందుబాటులోకి వస్తే జిల్లాలో వైద్య విద్య అభివృద్ధి చెందడంతో పాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను నాణ్యతతో కల్పించి, పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, సంబంధిత శాఖల అధికారులు, నిర్మాణ పనుల సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షపు నీటిని ఒడిసిపట్టుకోవాలి-కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిజామాబాద్, అక్టోబర్ 24: ప్రతి రైతు తన వ్యవసాయ భూమిలో ఫామ్ పాండ్ నిర్మించుకొని వర్షపు నీటిని నిల్వ చేసుకోవడం ద్వారా సాగునీటి సమస్యలను అధిగమించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శనివారం మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద రైతు సింగిని భిక్షపతి తన రెండెకరాల భూమిలో చేపట్టిన ఫామ్ పాండ్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు.

కూలీలతో మాట్లాడి పనుల పురోగతిని తెలుసుకున్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీటి లభ్యతకు అనుగుణంగా పంటలు సాగు చేస్తూ, వర్షపు నీటిని ప్రతి చుక్కా ఒడిసిపట్టాలని తెలిపారు. ఫామ్ పాండ్లతో నీటి సంరక్షణతో పాటు భూగర్భ జలాల పెంపునకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం పెద్దమల్లారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని సందర్శించి, రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్న శనగ విత్తనాలను పరిశీలించారు. విత్తనాలను సకాలంలో అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వై.ఎన్. గిరి, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## అమర పోలీసు కుటుంబానికి అండగా ఉంటాం: సీఐ జాన్‌రెడ్డి

### చాకిర్యాల్‌లో కానిస్టేబుల్ నరసయ్య కుటుంబానికి అధికారుల పరామర్శ



నిజామాబాద్, అక్టోబర్ 24: నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని మెండోరా మండలం చాకిర్యాల్ గ్రామానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ నరసయ్య కుటుంబాన్ని పోలీస్ అధికారులు పరామర్శించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సీఐ జాన్‌రెడ్డి, ఎస్సై సువాసిని, జిల్లా పోలీస్ అధ్యక్షుడు శ్రీనివాస్ నరసయ్య కుటుంబ సభ్యులను కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఈ సందర్భంగా సీఐ జాన్‌రెడ్డి మాట్లాడుతూ పోలీస్ శాఖ తరఫున నరసయ్య కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. పోలీస్ అమరవీరుల త్యాగాలు సమాజానికి స్ఫూర్తిదాయకమని, ప్రజల రక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయని పోలీసుల సేవలను ఎప్పటికీ మరువలేమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసుల కుటుంబాలను ఆదుకోవడం, వారికి అండగా నిలవడం పోలీస్ శాఖ బాధ్యత అని తెలిపారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని అధికారులు భరోసా ఇచ్చారు.

మెండోరా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జరిగిన ఈ పరామర్శలో అమరుల కుటుంబాలకు పోలీస్ శాఖ అండగా నిలుస్తుందనే భరోసా ప్రధానాంశంగా నిలిచింది.

# అటవీ సరిహద్దు వివాదాలు పరిష్కరించి, భూముల రీ సర్వేను వేగవంతం చేయాలి

**రెవెన్యూ, అటవీ శాఖల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ.**
**రైతులకు ముందస్తు సమాచారం ఇచ్చి రీ సర్వే చేపట్టాలి.**
**భూ పరిపాలన ప్రధాన కమిషనర్, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్ సమీక్ష.**



ములుగు, అక్టోబర్ 24:(నేటినిజం ప్రతినిధి): అటవీ సరిహద్దు వివాదాలను పరిష్కరించి, భూముల రీ సర్వే పనులను వేగవంతం చేయాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్ ఆదేశించారు.

రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించాలని సూచించారు.

శనివారం భూ పరిపాలన ప్రధాన కమిషనర్, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో భూముల రీ సర్వే పురోగతి, బృందాల ఏర్పాటు, అటవీ సరిహద్దు వివాదాలు తదితర అంశాలపై సమీక్షించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ములుగు సమీకృత కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు హాజరయ్యారు.

ఈ సందర్భంగా లోకేశ్ కుమార్ మాట్లాడుతూ రీ సర్వే పనులు సక్రమంగా సాగేందుకు అవసరమైన బృందాలను ఏర్పాటు చేసి, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అటవీ సరిహద్దు వివాదాలను సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రీ సర్వే చేపట్టే ముందు సంబంధిత రైతులకు సమాచారం అందించాలని తెలిపారు. ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న రైతులకు కూడా వారి భూముల్లో సర్వే నిర్వహించే తేదీలను ముందుగానే తెలియజేసి, వారు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

రీ సర్వే సందర్భంగా క్షేత్రస్థాయి రిజిస్టర్లను తప్పనిసరిగా నిర్వహించాలని స్పష్టం చేశారు. సర్వే వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

రీ సర్వే పనులకు అవసరమైన అదనపు రోవర్ పరికరాలను ప్రభుత్వం తగిన సంఖ్యలో సమకూరుస్తుందని తెలిపారు. భూ భారతి తరహాలో రీ సర్వే కోసం ప్రత్యేకంగా కొత్త పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. సిబ్బంది, పరికరాలను సమర్థంగా వినియోగించుకొని పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణవేణి, సర్వే, భూ రికార్డుల శాఖ సహాయ సంచాలకులు కిషన్ ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్లు నితీష్, మల్లేశ్వర్‌రావు, సర్వేయర్ గుణవంత్‌రావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం.. మనూరుకి చెందిన ఇద్దరు మృతి

సంగారెడ్డి, అక్టోబర్ 24:(నేటినిజం ప్రతినిధి): కర్ణాటక రాష్ట్రంలో ఒక ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. నారాయణఖేడ్ ప్రాంతం నుండి మహారాష్ట్రలోని ప్రముఖ పుణ్యక్షేత్రం తుల్జాపూర్ అమ్మవారి దర్శనార్థం వెళ్తున్న భక్తుల వాహనం కర్ణాటకలోని బసవకల్యాణ్ సమీపంలో ప్రమాదానికి గురైంది. ఈ దుర్ఘటనలో సంగారెడ్డి జిల్లా మనూరు మండలానికి చెందిన ఇద్దరు భక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, వాహనంలో ఉన్న మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు.

ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు మరియు సమాచారం అందుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం కర్ణాటకలోని బీదర్ ప్రభుత్వ ఆసుపత్రికి అత్యవసరంగా తరలించారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కాగా, విషయం తెలిసిన వెంటనే బసవకల్యాణ్ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. పోలీసులు కేసు నమోదు చేశారు; ప్రస్తుతం వారు ప్రమాదానికి గల కారణాలను నిర్ధారించే పనిలో ఉన్నారు, అలాగే మరణించిన వారి గురించి పూర్తి వివరాలను సేకరిస్తున్నారు.

# రూ.1.56 కోట్ల విదేశీ కరెన్సీ పట్టివేత

**శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఇద్దరు ప్రయాణికుల అరెస్ట్**
**దుస్తుల మధ్య నల్లటి ప్లాస్టిక్ కవర్లలో దాచిన వైనం**

హైదరాబాద్, అక్టోబర్ 24: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా విదేశీ కరెన్సీ పట్టుబడింది. ఇద్దరు ప్రయాణికుల నుంచి సుమారు రూ.1.56 కోట్ల విలువైన విదేశీ కరెన్సీని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఇద్దరినీ అరెస్టు చేశారు.

ప్రయాణికుల ట్రాలీ బ్యాగుల్లో దుస్తుల మధ్య నల్లటి ప్లాస్టిక్ కవర్లలో విదేశీ కరెన్సీని దాచినట్లు అధికారులు గుర్తించారు. వారి వద్ద నుంచి 1,64,200 అమెరికన్ డాలర్లు 3,773 మలేషియా రింగిట్లు , 2 సింగపూర్ డాలర్లు స్వాధీనం చేసుకున్నారు.

మొదటి ప్రయాణికుడి వద్ద రూ.63.62 లక్షల విలువైన విదేశీ కరెన్సీని అధికారులు గుర్తించారు. అతడు ఇచ్చిన సమాచారంతో మరో మహిళా ప్రయాణికురాలిని తనిఖీ చేయగా, ఆమె వద్ద రూ.91.94 లక్షల విలువైన అమెరికన్ డాలర్లు లభించాయి.

విదేశీ కరెన్సీని తరలించేందుకు అవసరమైన చట్టబద్ధమైన పత్రాలను చూపించకపోవడంతో అధికారులు చర్యలు చేపట్టారు. కరెన్సీతో పాటు వాటిని తరలించేందుకు ఉపయోగించిన ట్రాలీ బ్యాగులను కూడా సీజ్ చేశారు. అనంతరం ఇద్దరు ప్రయాణికులను అరెస్టు చేసినట్లు సమాచారం.

# నషా ముక్త్ భారత్ కార్యక్రమాలను విజయవంతం చేయాలి

**గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ ఐఏఎస్.**



ములుగు, అక్టోబర్ 24:(నేటినిజం ప్రతినిధి): నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా అక్టోబర్ 28న నిర్వహించనున్న కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, భారత రెడ్‌క్రాస్ సంస్థ తెలంగాణ రాష్ట్ర శాఖ చైర్మన్ దాన కిషోర్ ఐఏఎస్ సూచించారు.

శనివారం జిల్లా అదనపు కలెక్టర్లు, జిల్లా రెడ్‌క్రాస్ శాఖల ప్రతినిధులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కార్యక్రమాల ముందస్తు ఏర్పాట్లపై సమీక్షించారు.

ములుగు సమీకృత కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అక్టోబర్ 28న నిర్వహించనున్న ప్రతిజ్ఞ, అవగాహన ర్యాలీ, రక్తదాన శిబిరాలకు ఏర్పాట్లు చేపట్టాలని దాన కిషోర్ సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, మత్తు రహిత సమాజ నిర్మాణంలో ప్రజలను భాగస్వాములను చేయాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ అల్లం అప్పయ్య, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీనివాస్, సెక్రటరీ రాజి రెడ్డి, కోశాధికారి శిరుప సతీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# రైతులతో కలిసి ఎండిన వరి పంటతో సునీత లక్ష్మారెడ్డి ధర్నా



మెదక్, అక్టోబర్ 24: విద్యుత్ సమస్యలతో ఎండిపోతున్న వరి పంటలను చూసి రైతుల కష్టాలను తెలుసుకున్న ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి.. రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. వెల్దుర్తి మండల కేంద్రంలోని మాసాయిపేటలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఎండిన వరి పంటను పరిశీలించిన ఎమ్మెల్యే.. బాధిత రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని బ్లాక్ బుక్స్‌ను ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పరిశీలించారు. విద్యుత్ సరఫరా, అంతరాయాలకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. విద్యుత్ సమస్యల కారణంగా పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేసిన నేపథ్యంలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

జాతీయ రహదారిపై ధర్నాతో భారీగా నిలిచిన వాహనాలు

రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి నాయకులతో కలిసి జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ ఆందోళనతో రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైతుల పంటలను కాపాడేందుకు విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు.

# జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ 125 రోజుల పని

**వీబీజీ రామ్‌జీ పథకంతో గ్రామీణ పేదలకు ఆర్థిక భరోసా**

ఆదిలాబాద్, అక్టోబర్ 24: జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ వీబీజీ రామ్‌జీ పథకం కింద 125 రోజుల ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. వ్యవసాయ రంగంలో ఉపాధి అవకాశాలు తగ్గే పరిస్థితుల్లో ఈ పథకం గ్రామీణ పేదలకు ఆర్థికంగా అండగా నిలుస్తుందని తెలిపారు.

శనివారం కడెం మండలం కొండుకూరు గ్రామంలోని ఎస్కే ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జోన్-1 స్థాయి అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉన్నందున ఉపాధి పనులను వినియోగించుకోవాలని సూచించారు. పనులకు సంబంధించిన కూలీ డబ్బులు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. నీటి సంరక్షణ, జలవనరుల అభివృద్ధి పనులతో ఉపాధి కల్పించడంతోపాటు గ్రామాలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరుతాయని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించి, అర్హులైన వారందరూ ఉపాధి పనుల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో విజయలక్ష్మి, డీపీవో శ్రీనివాస్, వివిధ మండలాల అధికారులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

# కరువు ముప్పుపై సర్కారు నిర్లక్ష్యం : చాడ కిషన్‌రెడ్డి



ఖమ్మం, అక్టోబర్ 24: ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల ఇల్లెందు నియోజకవర్గ ఇన్‌చార్జి చాడ కిషన్‌రెడ్డి విమర్శించారు. టేకులపల్లి మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశంలో ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియా నాయక్‌తో కలిసి మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎల్‌నినో ప్రభావంపై గత ఆరు నెలలుగా ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నా తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. గోదావరి, కృష్ణా నదుల నుండి నీటిని ఎత్తిపోసి చెరువులు, కుంటలను నింపాలని కేటీఆర్, హరీశ్‌రావు పలుమార్లు సూచించిన విషయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు తక్షణమే కార్యాచరణ రూపొందించి, సాగునీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని డిమాండ్ చేశారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు, పార్టీ సభ్యత్వాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో పట్టభద్రులను కలిసి ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరుతున్నామని, కళాశాలలు, గ్రామాలు, పట్టణాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది అదనంగా 12 వేల సభ్యత్వాలు సాధించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు, టేకులపల్లి సర్పంచ్ బోడ బాలు, భూక్యా దళ్‌సింగ్ నాయక్, రాంపురం సర్పంచ్ బర్మావత్ శివకృష్ణ, బానోతు నరేష్, మహిళా నాయకురాలు ఆమేడ రేణుక, భానోత్ రామా నాయక్, భూక్యా లాలు, మాలోత్ పుల్‌సింగ్, నాగభూషణం, కామేపల్లి మండల నాయకులు అంతోటి అచ్చయ్య, మూడ్ కృష్ణ ప్రసాద్, మల్లంపాటి శ్రీనివాస్, సామా మోహన్‌రెడ్డి, కాటాల రాంబాబు, ఉద్యమకారులు దేవిలాల్, ఎన్.కే. నాగుల్‌మీరా, గుంపెనపల్లి అనంత రాములు, ఈసం రామ్మూర్తి పాల్గొన్నారు.

# నంద్యాల పట్టణ అభివృద్ధికి కృషి చేస్తా

**కూటమి అభ్యర్థులను గెలిపించండి..**
**టీడీపీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి డాక్టర్ బాబన్**
**టీడీపీ అభ్యర్థులకు వివిధ సంస్థల ప్రతినిధుల మద్దతు**

అమరావతి, అక్టోబర్ 24: నంద్యాల జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని పలువురు వక్తలు పేర్కొన్నారు. నంద్యాల పురపాలక చైర్మన్ పదవికి కూటమి తరఫున పోటీ చేస్తున్న తెలుగుదేశం పార్టీ అభ్యర్థి డాక్టర్ బాబన్ శనివారం నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం, కళారాధనతో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థల కేంద్ర కార్యాలయానికి వెళ్లి మద్దతు కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ బాబన్ మాట్లాడుతూ పెద్దలు, మేధావుల సలహాలు తీసుకుంటూ నంద్యాల పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర ఐఎంఏ మాజీ అధ్యక్షుడు, అంతర్జాతీయ లయన్స్ సంస్థ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్, నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం, నంద్యాల జిల్లా చిన్న, వీధి వ్యాపారుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు, కళారాధన వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, వివిధ క్రీడా సంఘాల అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ.. డాక్టర్ బాబన్‌ను సత్కరించారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ డాక్టర్ బాబన్‌తో పాటు కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని ప్రకటించారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్, మంత్రి ఫరూక్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి పనులు కూటమి అభ్యర్థుల విజయానికి దోహదం చేస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎం.వీ.వీ. రమణయ్య, కళారాధన కార్యనిర్వాహక కార్యదర్శి, సినీ, టీవీ, నాటక రంగ నటుడు ఎస్.ఆర్.ఎస్. ప్రసాద్, లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ సోమేశుల నాగరాజు, కళారాధన కార్యవర్గ సభ్యుడు శివరామిరెడ్డి, పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకుడు రామయ్య, దివ్యాంగుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు వెంకటరావు, రంగస్వామి, టీడీపీ నాయకుడు రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రులు అందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలి : మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్

హైదరాబాద్, అక్టోబర్ 24:ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు నమోదు కోసం హైదరాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు 23 వేల దరఖాస్తులు మాత్రమే వచ్చాయని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదు ప్రక్రియ చాలా తప్పు. గత ఎన్నికల్లో ఓటు వేసిన తర్వాత మళ్లీ నమోదు చేసుకోవాల్సిన అవసరం ఎందుకని చాలా మంది అడుగుతున్నారు..? లేనిపోని ఇబ్బందులు పెట్టి సమస్యలు తీసుకురావడం దురదృష్టకరమన్నారు.

రేపట్నుంచి ఓటర్ల నమోదు ఉధృతంగా తీసుకోవాలని నిర్ణయించామన్నారు. పట్టభద్రులు అందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలి. రేపు, ఎల్లుండి నియోజకవర్గాల వారీగా విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహిస్తామన్నారు. సోమవారం సీఈఓను కలిసి ఉన్న ఇబ్బందులను వివరిస్తాం

. సీఎం, ప్రభుత్వం సరిగ్గా ఉంటే ఇంత తక్కువగా ఎందుకు ఓటర్ల నమోదు ఎందుకు జరుగుతుంది..? చేతగాని ప్రభుత్వం, పని చేయడం రాదు? అందుకే కరెంట్, నీటి సమస్య ఇటువంటి పరిస్థితుల్లో ప్రతిపక్షం సలహాలు అయినా తీసుకోవాలి కదా.. కేసీఆర్‌ను తిట్టడం తప్ప ఇంకేమీ లేదన్నారు.

దరిద్రమైన పాలన వచ్చిన తర్వాతే రాష్ట్రానికి ఈ పరిస్థితి వచ్చిందని తలసాని ఫైర్ అయ్యారు. కరోనా సమయంలో కేసీఆర్ తీసుకున్న చర్యలను అందరూ ప్రశంసించారు, దేశం గర్వపడేలా చేశారు. కరెంట్, మంచినీరు ఉండదు అని ఇప్పుడు చెప్తున్నారు? ఆర్నెళ్లుగా మేము చెప్తున్నా పట్టించుకోలేదు. భగవంతుడు కూడా మిమ్మల్ని కాపాడలేరన్న అంశాన్ని గుర్తించాలి. కేసీఆర్ హయాంలో కరెంట్, తాగునీరు, సాగునీరు ఎలా వచ్చిందో ప్రజలు అందరికీ తెలుసు. రైతులు, ప్రజల ఇబ్బందులు గాలికి వదిలేసి బూతు పురాణం అందుకుంటున్నారు.

ఎక్కడైనా ముఖ్యమంత్రి క్షుద్రపూజలు అని మాట్లాడతారా..? బీఆర్ఎస్ అంటే భయం లేకపోతే ప్రతిసారి మా ప్రస్తావన ఎందుకు వస్తోంది. ఇలాగే కాలయాపన చేయండి? రెండేళ్ల తర్వాత ప్రజలు ఇంటికి పంపుతారు. ప్రభుత్వం ఇకనైనా అందరిని సమన్వయం చేసుకొని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి. తలసానితోపాటు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ,ఎమ్మెల్సీలు వాణీ దేవి ,దాసోజు శ్రవణ్ ,కార్పొరేషన్ మాజీ చైర్మన్లు క్రిశాంక్ ,గజ్జల నగేష్ ,అల్లీ పురం వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు ప్రెస్‌మీట్‌లో పాల్గొన్నారు.


ఆంధ్రాబ్యాంక్ వ్యవస్థాపకులు
శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్య గారి పేరుతో స్థాపించిన




డా॥ పట్టాభి కళా పీఠము
(ప్రతిభకు పట్టాభిషేకం)
(రి. 234/2010)
ఫ్లాట్ నెం. ఎ/404, శివ గ్రీన్ వ్యాలీ, గోరంట్ల, గుంటూరు - 522 034.

ఆహ్వానము

డా॥ పట్టాభి జయంతి –
పట్టాభి అవార్డ్స్–2025 ప్రదానోత్సవ సభ
(సీనియర్ సిటిజన్స్‌కు ప్రత్యేకం)

తేది : 14-11-2026 (2వ శనివారం)
వేదిక : పెన్ననర్ల భవనం
తాలూకా కాంపౌండ్, బ్రాడీపేట, గుంటూరు.
సమయం : ఉదయం 10 గం॥లకు

సభా కార్యక్రమం
సభాధ్యక్షులు :
డా॥ తూములూరి రాజేంద్రప్రసాద్
అధ్యక్షులు, డా॥ పట్టాభి కళాపీఠము

ముఖ్య అతిథి :
గౌ॥ శ్రీమతి పొడపాటి తేజస్విని గారు
అధ్యక్షురాలు, ఆం.ప్ర. సృజనాత్మక, సాంస్కృతిక సమితి, అమరావతి

విశిష్ట అతిథి :
ఆచార్య వెలుదండ నిత్యానందరావు గారు
ఉపకులపతి, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్

# ఆదరణ కరువైన తోలుబొమ్మలాట

సినిమాలు, టి.వి.లు లేని రోజుల్లో వృత్తి కళాకారుల ప్రదర్శనలకు ప్రజలు బ్రహ్మరథం పట్టేవారు. అలిసి పోయిన పల్లె ప్రజలకు జానపదుల ప్రదర్శనలు సేదతీర్చేవి. గ్రామాల్లో జానపద కళాకారులు వివిధ రకాలైన ప్రదర్శనలు ఇచ్చేవారు. ముందు తరాలవి శ్రమైక జీవన విధానం. కష్టజీవులే ఎక్కువ మంది. రోజంతా కాయకష్టం చేసి ఇళ్లకు చేరిన వారి అలసట తీర్చి వారికి సాంత్వన చేకూర్చే కళా రూపాలే జనపదాలు. అలాంటి వాటిలో తోలు బొమ్మలాట ప్రధాన మైనది.

తోలు బొమ్మలాట ఒక జానపద కళారూపం. తాను స్వయంగా అనుకరించలేని జానపదుడు కావ్యాల్లోనూ, పురాణాల్లోను వర్ణింపబడిన పాత్రల ఆహార్య విశేషాలను స్వయంగా సృష్టించు కున్నాడు. తన భాషతో ఆ మూగ చిత్రాలకు ప్రాణం పోశాడు. రకరకాల విన్యాసాలను వాటి చేత చేయించాడు. తాను స్వయంగా వెనుకనుండి ఈ పాత్రలను కదిలించాడు. కదులుతున్న ఆ జీవంలేని బొమ్మలతో జీవ నిబద్ధమైన ఒక దృశ్యాన్ని ప్రదర్శించడం లోనే జానపదుడి కళాత్మకత దాగి ఉంది. సుసంపన్న మైన హిందూ ఇతిహాసాలను తెర మీదకి తెచ్చిన ఒక గొప్ప ప్రక్రియ తోలు బొమ్మలాట.

ఒక సామూహిక సంగీత, నాట్య ప్రదర్శన కళారూపమైన తోలు బొమ్మలాట, జానపదుని మొదటి రంగస్థల ప్రదర్శన కళారూపాన్ని గుర్తించ వచ్చు.

పూర్వం రాజాస్థానాల లోని పండితులు తమ ప్రభువులను సంతోష పెట్టడానికి బొమ్మలను తయారు చేసి మానవులుగా నటింపచేస్తే సృజనాత్మకంగా ఉంటుందని భావించి తోలు బొమ్మలను తయారుచేసి, తెల్లటి పంచెను తెరగా అమర్చి, దానిపైన దీపం కాంతిలో బొమ్మల నీడలను పడేటట్లు చేసి బొమ్మలాటను ప్రదర్శించేవారు. ఈ విధంగా తోలు బొమ్మలాట పుట్టిందని, ఈ ఆట పండితుల చేత మెరుగులు దిద్దుకున్నదని, చెప్పడానికి అమర కోశం లోని శ్లోకాలను నిదర్శనంగా పేర్కొనవచ్చు.

మహా భారతంలో తోలు బొమ్మలాట ప్రస్తావన ఉంది. భగవద్గీతలో సత్వ, తమో, రజో గుణాలు మూడు దారాలని, అవి పరమాత్ముని చేత మానవ జీవన గమనంలో లాగబడు తుంటాయని చెప్పబడింది. మానవుడు బొమ్మ అయితే అతనికున్న సూత్రాలు ఈ మూడు గుణాలు. ఆడించేవాడు జగన్నాటక సూత్రధారి అన్న అర్థంలో ఉన్న ఈ భాగం తోలు బొమ్మలాటలకు సంబంధించిన ప్రస్తావన.

భారతీయ జానపద ప్రదర్శన కళల్లో అతి ప్రాచీనమైన దృశ్య రూపకానికి చెందినది తోలు బొమ్మలాట. క్రీ.పూ 3 వ శతాబ్దం నాటికే తెలుగు దేశంలో తోలు బొమ్మలాట ప్రచారంలో ఉన్నట్లు తెలుస్తోంది.

చరిత్రకారుల ప్రకారం తోలు బొమ్మలు క్రీ.పూ 2500 సం.నకు పూర్వం, పురాతన నాగరికత అయిన హరప్పా, మొహంజోదారో కొన్ని వేల కిలోమీటర్ల వరకూ వ్యాపించినట్లు చెపుతారు. క్రీ.పూ 3 వ శతాబ్దానికి చెందిన అశోకుని శిలా శాసనాల్లో జంబూ ద్వీపానికి బొమ్మలాట ప్రదర్శన రంగంగా ఆపాదించారు. పతంజలి మహాభాష్యంలో తన కాలపు వినోద సాధనాలను వివరిస్తూ మూడు ప్రధానమైన వాహికలను వివరిస్తూ వాటిలో బొమ్మలాట ఒక ప్రధనమైన వాహిక అని వివరించారు.

తేరి గాథ అను బౌద్ధ గ్రంథంలో బొమ్మలాటకు

**అక్టోబర్ 25... అంతర్జాతీయ కళాకారుల దినోత్సవం**



సంబంధించిన ప్రస్తావన ఉంది. వాత్సాయనుని కామసూత్రాల్లో బొమ్మలలోని రకాలు, బొమ్మలాటల్లోని తేడాలు చర్చింప బడినాయి. కన్యలను ఆకర్షించడానికి బొమ్మలాటల ప్రదర్శన అవసరమని వాత్సాయనుని వివరణ. నాటకానికి, తరువాత పరోక్షంగా తోలుబొమ్మలాట సినిమాకు మూలమైంది.

కదలికలోని ఆనందం కనుక్కున్న మనిషి ఆలోచనలో నుండి పుట్టిందే బొమ్మలాట. స్థిరత్వం నుండి చలనం వైపుకు పయనించడంలో భాగంగా ప్రాచీన మానవుడు బొమ్మలాటను సృష్టించు కున్నాడు. కథ చెప్పడం మొదలైన తరువాత ఆ కథలోని పాత్రలు తెరమీద కనిపిస్తే, నటిస్తే చూడాలన్న జనపదుడి తపనలో నుండి బొమ్మలాట పుట్టింది. బొమ్మలతో ఆడుకోవడం అతి ప్రాచీన కళ. కొయ్యబొమ్మ లాటలు, కట్టెబొమ్మ లాటలు, తొడుగు బొమ్మలాటలు, తళ్ళబొమ్మ లాటలు, బుట్టబొమ్మ లాటలు, తోలుబొమ్మ లాటలు అని బొమ్మలాటలు అనేకము ఉన్నాయి.

రంగస్థలంపై పొడవాటి గుంజలపై తెల్లటి వస్త్రాన్ని లేదా పంచెను ముందు భాగంలో గట్టిగా లాగి కడతారు. తెర భూమి నుండి నిలువుగా ఉండకుండా కొంచెం ఏటవాలుగా కడతారు. ఈ విధంగా కట్టడం వల్ల బొమ్మలను ఆడించే టప్పుడు బొమ్మలకు కాళ్ళు అడ్డు తగలకుండా ఉంటుంది. తోలు బొమ్మల ప్రతిబింబాలు సరిగ్గా తెరపై పడడానికి తెరలోపలి నుండి పూర్వం కాగడాలు ఉపయోగించేవారు. విద్యుత్ సౌకర్యం అభివృద్ధి చెందిన తర్వాత ఎక్కువ కాంతిని ఇచ్చే విద్యుత్ బల్బులను వాడుతున్నారు.

ప్రదర్శన సంబంధమైన కదలికలకు అనుగుణంగా ప్రధాన గాయకుడు పాడుతూ వుంటే, మిగిలిన వారు వంతలుగా పాడుతారు. వంతల్లో స్త్రీలు ప్రధానంగా ఉంటారు. రాగం తీయడం, ముక్తాయింపు, సంభాషణ ధోరణిలో స్త్రీగొంతు ముఖ్యపాత్ర వహిస్తుంది. స్త్రీ పాత్రలకు స్త్రీలే పాడతారు.

తోలు బొమ్మలాటలో సామాజిక స్థితిగతులకు దర్పణంగా నిలిపి, పాత్రల ద్వారా సమాజంలో ఉండే దురాచారాలను, మూఢ నమ్మకాలను ఎండగడతారు. ఇందులో సామెతలు, లోకోక్తులు, పొడుపు కథలు, నీతికథలు మొదలైనవి చోటు చేసుకుంటాయి. అదేవిధంగా అభినయాలకు స్వభావానుగుణంగా తేల్చడానికి వాద్యానికి సంబంధించి హార్మోనియం, తాళాలు, తొక్కుడుబిళ్ల, మద్దెల, డప్పు, గజ్జెలు వంటివి ప్రధాన భూమికను నిర్వహిస్తాయి. తోలు బొమ్మల ప్రదర్శనలో రామాయణం, భారతం లకు సంబంధించిన కథా వస్తువులు ఉంటాయి. లంకా దహనం, సతీసులోచన, యయాతి, అంగద రాయబారం, మైరావణ వధ, విరాటపర్వం, పద్మవ్యూహం, ఉత్తర గోగ్రహణం వంటి కథలతో తోలు బొమ్మలను ప్రదర్శిస్తారు. తోలు బొమ్మలు ఆంధ్ర రాష్ట్రంలో ప్రాచీన ఓడరేవులైన కళింగపట్నం, భీమునిపట్నం, కోరంగి, మచిలీపట్నం, వాడరేవు, కొత్తపట్నాల నుంచి విదేశాలకు భారతీయులతో పాటు వెళ్ళాయి. పర్షియా, టర్కీ ల మీదుగా గ్రీసు దేశంలో ప్రవేశించిన తోలుబొమ్మలు, గ్రీసులో నూతన రూపం సంతరించుకుని ఉత్తరాఫ్రికా లోని ముస్లిం దేశాలకు, 17వ శతాబ్దంలో ఇటలీకి, అక్కడినుండి ఫ్రాన్స్ లోని వెర్సయిల్స్, పారిస్, పేలేరాయల్ నగరాలకు వ్యాపించాయి. తోలు బొమ్మలు కాలానుగుణంగా ఆయాదేశాల్లో భిన్నరూపాలు ధరించినప్పటికీ, భారతదేశం వీటికి మాతృక అని చెపుతారు.

తోలుబొమ్మల ఆటలు క్రమేపీ కనుమరుగు కాక తప్పని స్థితి నెలకొంది. తోలు బొమ్మల కళారూపం అంతరించి పోవడానికి గల కారణం నాటకాల ప్రభావం ఉధృతంగా ఉండడం, పద్యనాటకాల ప్రాధాన్యత పెరగడం, నాటకాలలో శాస్త్రీయతకు, సాంకేతిక పరిజ్ఞానానికి ఉన్నతస్థానం లభించడం, సినిమాలు ప్రజలను సమ్మోహితులను చేయడం, తెరపై ప్రేక్షకులకు కావలసినవి అందించడం, అదేవిధంగా ఇంట్లోనే జనరంజకం అన్న నేపథ్యంలో విస్తృతంగా ఛానల్స్ వచ్చి ప్రపంచ తీరు తెన్నులను మార్చడం వంటి ఎన్నో కారణాలు తోలుబొమ్మలు లాంటి కళారూపాల మనుగడకు సవాలుగా నిలిచాయి. ఇలాంటి విషమ పరిస్థితుల్లో, మన ప్రాచీన కళా రూపాల ఆనవాళ్ళు అని చెప్పడానికి వాటిని బ్రతికించు కోవలసిన అవసరం ఎంతైనా అవసరం.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

## కేజీబీవీలో ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ గరి మ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 24:(నేటినిజం ప్రతినిధి): తంగళ్లపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం(కేజీ బీవీ) విద్యాలయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శనివారం తనిఖీ చేశారు. ముందుగా ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరు రిజిస్టర్ పరిశీలించారు. అనంతరం కిచెన్ ఆవరణ, ఫ్రీజర్, సరుకులు తనిఖీ చేసి.. అధికారులకు జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు. అలాగే కంప్లైంట్స్ బాక్స్ పరిశీలించి.. ఎలాంటి ఫిర్యాదులు వస్తున్నాయని ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. విద్యాలయం ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని సూచించారు. కంప్లైంట్స్ బాక్స్ లో వచ్చే ఫిర్యాదులపై స్పందించాలని, ఆయా సమస్యలు రాకుండా ముందస్తుగా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## వర్షపు నీటిని ఒడిసిపట్టుకోవాలి- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిజామాబాద్, అక్టోబర్ 24: ప్రతి రైతు తన వ్యవసాయ భూమిలో ఫామ్ పాండ్ నిర్మించుకొని వర్షపు నీటిని నిల్వ చేసుకోవడం ద్వారా సాగునీటి సమస్యలను అధిగమించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శనివారం మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద రైతు సింగిని భిక్షపతి తన రెండెకరాల భూమిలో చేపట్టిన ఫామ్ పాండ్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు.

కూలీలతో మాట్లాడి పనుల పురోగతిని తెలుసుకున్నారు. ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీటి లభ్యతకు అనుగుణంగా పంటలు సాగు చేస్తూ, వర్షపు నీటిని ప్రతి చుక్కా ఒడిసిపట్టాలని తెలిపారు. ఫామ్ పాండ్లతో నీటి సంరక్షణతో పాటు భూగర్భ జలాల పెంపునకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం పెద్దమల్లారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని సందర్శించి, రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్న శనగ విత్తనాలను పరిశీలించారు. విత్తనాలను సకాలంలో అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు




## అంతరించిపోతున్నజానపద కళలకు జీవం పోయాలి

**బిజ్వార్‌లో ఘనంగా 'భీమసేన విలాసం' యక్షగాన ప్రదర్శన**



మహబూబ్‌నగర్, అక్టోబర్ 24: కంప్యూటర్ యుగంలో అంతరించిపోతున్న జానపద కళలను కాపాడి, భావితరాలకు అందించాలని బిజ్వార్ సర్పంచ్ కొల్లంపల్లి అంజయ్య, ఉపసర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం బిజ్వార్‌లో 'భీమసేన విలాసం' నాటిక ప్రదర్శనను వారు ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన రైతులు, యువకులు రోజంతా పనులు చేసుకుని, రాత్రివేళల్లో రెండు నెలలపాటు సాధన చేసి ఈ ప్రదర్శనకు సిద్ధమవడం అభినందనీయమన్నారు. సుమారు రూ.80 వేల సొంత ఖర్చుతో మన సంస్కృతి, సంప్రదాయాలు, కళలను భావితరాలకు పరిచయం చేసేందుకు వారు చేస్తున్న కృషిని ప్రశంసించారు. భీమసేన విలాసం యక్షగానంలో 12 మంది కళాకారులు భారీ కిరీటాలు, రంగురంగుల దుస్తులు ధరించి పద్యాలు ఆలపిస్తూ, నృత్యాలతో మహాభారతంలోని భీముడి పరాక్రమాన్ని ప్రదర్శించారు. ముఖ్యంగా అజ్ఞాతవాసంలో భీముడు కీచకుడిని వధించే ఘట్టాన్ని కళాకారులు అద్భుతంగా ప్రదర్శించడంతో ప్రేక్షకులు ఆసక్తిగా తిలకించారు. ఈ ప్రదర్శనతో వర్షాలు కురిసి కరువు తొలగిపోతాయనే స్థానిక నమ్మకం ఉందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పంతులు పులిమామిడి చెన్నయ్య దాసు, కళాకారులు చింతలి ఎల్లప్ప, లొద్ద సంజప్ప, కొల్లంపల్లి రామప్ప, తోక పరశురాం, గడ్డం లక్ష్మీకాంత్, జట్రం ఆంజనేయులు, దొబ్బలి తిరుమలేశ్, తోక ఆంజనేయులు, దొబ్బలి ఈశ్వరప్ప, డోలిమి కథలప్ప, దొబ్బలి కుర్మప్ప, దాసరి ఆంజనేయులు, హాస్యనటుడు ధన్వాడ వెంకట్రాములు, వాయిద్యకారులు హన్మంతు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ వైద్య సేవలతో ఉన్నత స్థానాలకు ఎదగాలి

**సామాజిక సేవలో భాగంగా కొందరికైనా ఉచిత వైద్యం చేయాలిజిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 24: (నేటినిజం ప్రతినిధి): వైద్య కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు డాక్టర్లుగా ఉత్తమ వైద్య సేవలు అందించాలని, ఉన్నత స్థానాలకు ఎదగాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో వైట్ కోట్ సెర్మనీ శనివారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారం భించారు.

ఈ సందర్భంగా పలువురు వైద్య విద్యార్థులకు వైట్ కోట్ లు అందజేసి అభినందించారు. అనంతరం నిర్వాహకులు జిల్లా కలెక్టర్, ఎస్పీని శాలువాతో సన్మానించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. సమాజంలో వైద్యం, విద్యకు అత్యంత ప్రాధాన్యత ఉందని తెలిపారు. వైద్య విద్య అభ్యసించేందుకు చాలా కష్టపడాల్సి ఉంటుందని, నీట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తేనే ఈ అవకాశం వస్తుందని వివరించారు. ప్రతి విద్యార్థి విజయం వెనుక వారి తల్లిదండ్రుల శ్రమ, ప్రోత్సాహం ఉంటుందని పేర్కొన్నారు. వైద్యుల సేవలు చాలా కీలకమని స్పష్టం చేశారు. గర్భిణులు, పిల్లలు, వివిధ రోగాలతో బాధ పడే వారికి వైద్యులు ఎంతో ఓపికతో సేవలు అందిస్తారని కొనియాడారు. వైద్యులు తాము ఎంచుకున్న విభాగంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. సమాజ సేవలో భాగంగా వైద్యులు కొందరికైనా ఉచిత వైద్య సేవలు అందించాలని సూచించారు. దీంతో ఆత్మ సంతృప్తి ఉంటుందని తెలిపారు. వైద్యం, సేవల్లో మిగతా వారికి ఆదర్శంగా నిలవాలని ఆకాక్షించారు. వైద్యులు తమ ఆరోగ్యం, ఆహారం శ్రద్ధ పెట్టాలని సూచించారు. సిరిసిల్ల వైద్య కళాశాల, బాలికల, బాలుర హాస్టల్ నిర్మాణ పనులను తాను పలుమార్లు సందర్శించానని గుర్తు చేశారు. ప్రస్తుతం బాలికల హాస్టల్ వినియోగంలోకి వచ్చిందని తెలిపారు. మెడికల్ కాలేజీ, బాలుర హాస్టల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి.. త్వరలోనే వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ నిర్విష, తహసీల్దార్ మహేష్ కుమార్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు స్థలాల పట్టాలను కేటాయించాలి

**ఐజేయూ జర్నలిస్ట్ యూనియన్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్**



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 24:(నేటినిజం ప్రతినిధి):, అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాల పట్టాలను వెంటనే కేటాయించాలని ఇండియన్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) చందుర్తి మండల అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శనివారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి అనంతరం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 2021 వ సంవత్సరంలో అప్పటి రెవిన్యూ అధికారులు మండలంలోని మూడపల్లి గ్రామ శివారులోనీ సర్వే నెంబర్ 14/1 లో 27 గుంటల భూమి స్థల పరిశీలన చేసి మొఖా అందజేశారని పేర్కొన్నారు...ఐదు సంవత్సరాలుగా తమ ఆధీనంలో ఉన్న భూమిని ఇటీవల కొంత మంది వ్యక్తులు అక్రమంగా ప్రవేశించేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. జర్నలిస్టుల ఆందోళనను తెలుసుకున్న తాహాసిల్దార్ భూపతి మూడపల్లి గ్రామంలో ఉన్న భూమి జర్నలిస్టుల ఆధీనంలో ఉన్న మాట వాస్తవమేనని జర్నలిస్టులకు న్యాయం జరిగే విధంగా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు జోగినిపల్లి చందు. గాలిపెల్లి సుధీర్. గోలి నరేష్. గడ్డం తిరుపతిరెడ్డి. రాచర్ల రాజు. లాండే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సిరిసిల్లలో వైభవంగా శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు..

**పద్మావతి అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించిన పద్మశాలి సంఘం**

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 24:(నేటినిజం ప్రతినిధి): సిరిసిల్లలో శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సిరిసిల్ల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పద్మావతి అమ్మవారికి ఒడిబియ్యం, నూతన పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పద్మశాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉదయం శ్రీ శివభక్త మార్కండేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పద్మశాలి మహిళలు అమ్మవారికి సమర్పించేందుకు ఒడిబియ్యాన్ని సిద్ధం చేశారు. మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయానికి చేరుకుని స్వామివారితో పాటు లక్ష్మి, పద్మావతి అమ్మవార్లకు శాస్త్రోక్తంగా ఒడిబియ్యం, పట్టు వస్త్రాలు సమర్పించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పద్మావతి అమ్మ వారిని పద్మశాలి ఇంటి ఆడపడుచుగా భావించి ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాల సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో ఒడిబియ్యం, పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు.

ఈ ఏడాది కూడా సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు.

కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న పద్మశాలి కులబాంధవులు, భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

పద్మశాలి సంఘం అధ్యక్షుడు దూడం శంకర్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా ఒడిబియ్యం సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.